


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 200 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 26 మార్చి 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE :200 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 26 MARCH 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం...
# 3 వేల లక్ష్యాలపై దాడులు

- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ బాంబులు వేశామని వెల్లడి
- గత జూన్ సంఘర్షణ కాలం నాటితో పోలిస్తే నాలుగు రెట్లు బాంబులు వేశామని వెల్లడి
- ప్రకటించిన ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్



పెన్ పవర్ డెస్క్:యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్‌పై 15,000 బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బాంబులు వేశామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగురెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు.

- మిగతా2లో

# ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీ వసూలు చేయొద్దు
## హెటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

- ఎల్పీజీ గ్యాస్ కొరతపేరుతో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నాయన్న సీసీపీఏ
- హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు, మీడియాలో కథనాలు వచ్చినట్లు వెల్లడి
- అదనంగా ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్న కేంద్రం

- మిగతా2లో



## పర్యాటకుల కోసం హోటల్ గదులు,
# హోమ్ స్టేలను పెంచండి

- పర్యాటక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పర్యాటకులు మరింత పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్న ముఖ్యమంత్రి
- కారావాన్ పార్కులు, టెంట్ సిటీల ఏర్పాటుకు చర్యలు
- పర్యాటక ప్రోత్సాహకానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటులోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు.క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు.కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు.

అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

- మిగతా2లో

## చంద్రబాబుకు
# భయపడొద్దు..
## ఆ రోజులు పోయాయి: జగన్

- అద్దంకి నియోజకవర్గ వైసీపీ నేతలతో జగన్ సమావేశం
- ప్రతి విషయంలో క్రెడిట్ చోరీ చేస్తున్నారని విమర్శ
- మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్: వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజ కవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు.ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా

- మిగతా2లో





## జగన్ జీవితం జంగిల్ బుక్ లాంటిది

- అరాచకం, అబద్ధాలే తప్పించి వాస్తవాలు ఏనాడూ మాట్లాడలేదని విమర్శ
- అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు చేయడం జగన్ బలహీనతకు నిదర్శనమని వ్యాఖ్య
- వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని ఆగ్రహం

- మిగతా2లో

## అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..
### డయాగ్రిడ్ టెక్నాలజీతో అద్భుత నిర్మాణం



- అమరావతిలో వేగం పుంజుకున్న ఐకానిక్ టవర్ల పనులు
- హెచ్‌ఓడీ టవర్-3 వద్ద 'కార్నర్ నోడ్' అమర్చే పనులను ప్రారంభించిన నారాయణ
- అమరావతి నిర్మాణానికి ప్రజల పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని వెల్లడి

- మిగతా2లో

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

- ముఖ్యమంత్రి సమక్షంలో కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం
- తెలుగు రుచులను ప్రపంచానికి పరిచయం చేయడంలో వర్సిటీ సహకారం
- ఏపీని కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి దోహదపడనున్న ఎంఓయూ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి

- మిగతా2లో



## 'వందేమాతరం' పాడటం
# తప్పనిసరి కాదు



- 'వందేమాతరం' సర్క్యులర్‌ను సవాలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఆదేశాలు కేవలం సలహా మాత్రమేనని, తప్పనిసరి కాదని చెప్పిన సుప్రీంకోర్టు
- ప్రభుత్వ సర్క్యులర్‌లో శిక్షార్హమైన చర్యలు లేవని స్పష్టం చేసిన ధర్మాసనం
- పరోక్ష ఒత్తిడి ఉంటుందన్న పిటిషనర్ వాదనలు ఊహాజనితమన్న కోర్టు
- దేశభక్తిని బలవంతం చేయలేరని వాదించిన సీనియర్ న్యాయవాది

- మిగతా 2లో




## భాగ్యనగరంలో ప్రయాణికులకు
# ఆర్టీసీ శుభవార్త

- మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ
- పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో ప్రయాణికులకు ఊరట
- ఆర్టీసీ బస్సులు ఉండగా పెట్రోల్ కష్టాలు దండుగ అంటూ ఆర్టీసీ ఎండీ ఆసక్తికర వ్యాఖ్య

- మిగతా2లో

# అమెరికా విమాన వాహకనౌక లక్ష్యంగా క్షిపణి దాడులు చేశాం
## హెచ్చరించిన ఇరాన్ ప్రకటన

- యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడి
- విమాన వాహన నౌక కదలికలను పరిశీలిస్తున్నామని అంతకుముందే ఇరాన్ ప్రకటన
- ఆ తర్వాత గంటలోపు క్షిపణితో దాడి చేసిన ఇరాన్

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

### యూరియాపై పశ్చిమాసియా ప్రభావం

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా నిల్వలు తగినంతగా ఉన్నాయని, వ్యవసాయానికి ఎలాంటి ఆటంకం ఏర్పడదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పరిస్థితులు అనూహ్యంగా ఉంటున్నాయి. మార్చి 10 నాటికి భారత్‌లో యూరియా నిల్వలు 61.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయని, అంటే గత ఏడాది ఇదే సమయంలో ఉండే నిల్వల కన్నా 10 లక్షల టన్నుల వరకు అధికంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ వాణిజ్యాన్ని అల్లకల్లోలం చేస్తోం ది. ఈ సంక్షోభం వ్యవసాయానికి ప్రధాన అవసరమైన యూరియా తయారీకి కావలసిన లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ద్రవీకృత సహజవాయువుఎల్ఎన్‌జి) సరపరాపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. యుద్ధం ప్రకంపనలు ఇప్పటికే భారత్ యూరియా సరఫరాను దెబ్బతీస్తున్నాయి. ఆదివారం (మార్చి 22) నాటికి భారత్ లోని యూరియా ప్లాంట్లు సగం సామర్థ్యంతో నడుస్తున్న పరిస్థితి ఏర్పడింది. కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. భారత్ అతిపెద్ద ఎల్ఎన్‌జి దిగుమతిదారైన పెట్రోనెట్ ఎల్ఎన్‌జి సంస్థ ఖతార్ నుండి దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా గ్యాస్ సరఫరాను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. ఇటీవల ఖతార్‌లోని రాస్‌లాఫాన్‌లో యుద్ధంవల్ల గ్యాస్ సరఫరా వ్యవస్థకు నష్టం జరగడంతో ఒప్పందం ప్రకారం సరఫరా చేయలేనని పెట్రోనెట్ చేతులుఎత్తేసింది. ఈ చర్య కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం లోని గెయిల్ (ఇండియా), ఇండియా ఆయిల్ కార్పొరేషన్ సంస్థ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి గ్యాస్ పంపిణీదారుల ద్వారా సరఫరా కోతకు దారి తీసింది. ఎల్ఎన్‌జి సరఫరా కోసం భారత్ భారీగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్ రోజూ 4.7 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును, అంటే తన అవసరాల్లో 88%, అలాగే 47% సహజవాయు డిమాండ్ కోసం ద్రవీకృత సహజవాయువును విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరగడమే కాకుండా ఎరువులపై భారత ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై కూడా ప్రభావంపడే అవకాశం కనిపిస్తోంది. యూరియా కొరతవల్ల వ్యవసాయ ఉత్పాదక ఖర్చులు పెరగడమే కాకుండా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. 2025లో అంతర్జాతీయ మార్కెట్ నుంచి 50% పైగా సహజవాయువు (ఎల్ఎన్‌జి)ను భారత్ దిగుమతి చేసుకుంది.

ప్రపంచం మొత్తంమీద భారీస్థాయిలో ఎల్ఎన్‌జి నాలుగో కొనుగోలుదారు భారత్‌యే. 2025లో 261 లక్షల మెట్రిక్ టన్నుల ఎల్ఎన్‌జిని భారత్ దిగుమతి చేసుకుంది. ఇందులో 40% ఖతార్ నుంచి మిగతా 20% యుఎఇ, ఒమన్ ద్వారా సరఫరా అవుతుంది. ఈ ఎల్ఎన్‌జి అంతా హోర్ముజ్ జలసంధి ద్వారానే నౌకల మీదుగా రవాణా అవుతుంది. మొత్తం మీద భారత్ దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జి 60% వరకు హోర్ముజ్ జలసంధి మూసివేయడంవల్ల అంతరాయం ఏర్పడుతోంది. భారత్‌లో అమోనియా తయారీకి తద్వారా ఎరువుల తయారీకి ప్రధానంగా సహజవాయువునే వినియోగిస్తుంటారు. 2026లో భారత్‌కు సరఫరా అయిన ఎల్ఎన్‌జిలో 30% ఎరువుల తయారీకే వినియోగం కావడం గమనార్హం. యూరియా ఉత్పత్తికి ఎల్ఎన్‌జి ప్రధాన వనరు. దేశంలో ఎరువులుగా యూరియానే ఎక్కువగా వాడుతుంటారు. యూరియా ఉత్పత్తి అత్యంత ఇంధన వినియోగతో కూడిన ప్రక్రియ. ఈ యూరియా ప్లాంట్లు తక్కువ ఉద్గారాలను విడుదల చేసే సహజవాయువు వినియోగంలోకి మారాయి. జాతీయ స్థాయిలో యూరియా వినియోగం గత దశాబ్దకాలంలో క్రమంగా పెరిగి 2025లో 387 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. 2025లో స్వదేశీ యూరియా ఉత్పత్తి కూడా దాదాపు 306 లక్షల మెట్రిక్ టన్నుల వరకు జరిగినా దేశం మొత్తం మీద డిమాండ్‌ను నెరవేర్చలేకపోతోంది. అందువల్ల భారత్ యూరియా దిగుమతులపై ఆధారపడవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం స్వదేశీ యూరియా ఉత్పత్తిని, సరఫరాను దెబ్బతీస్తోంది. 2025లో భారత్ యూరియా దిగుమతులు 2300 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయి. ఈ దిగుమతుల్లో 71% పశ్చిమాసియా నుంచి రావలసి ఉండగా, ఇందులో 45% ఒమన్, సౌదీఅరేబియా, ఖతార్, యుఎఇ నుంచి సరఫరా అవుతుంటాయి. ఈ మొత్తం సరఫరా హోర్ముజ్ జలసంధిద్వారా రవాణా కావలసి ఉంది. ఈ నేపథ్యంలో సహజవాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వు 2026ను భారత ప్రభుత్వం జారీ చేసింది. ఇందులో ఎరువుల రంగాన్ని ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. రెండు మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించినప్పుడు కూడా ఇంధనం, ఎరువుల సరఫరా విషయంలో కూడా భారత్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఎరువుల తయారీకి ప్రాధాన్యం ఇచ్చి స్వదేశీయంగా సబ్సిడీ ధరకు గ్యాస్ లభిస్తేనే ఎరువులు ఉత్పత్తి అవుతాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల కూడా పొటాష్ సరఫరా దెబ్బతింది. ప్రపంచ దేశాలకు సరఫరా అయ్యే యూరియాలో 14% ఒక్క రష్యా నుంచే సరఫరా అవుతోంది. డిఎపిలో రష్యా సరఫరా దాదాపు 10% వాటాతో రెండో ఉత్పత్తిదారుగా రష్యా ఉంటోం ది. పొటాష్‌లో కావలసినవి 50% రష్యా, బెలారస్ నుంచే రప్పించుకోక తప్పదు. భారత్ డిఎపి డిమాండ్‌లో దాదాపు 60% చైనా, సౌదీఅరేబియా నుంచే లభిస్తోంది. ఇప్పుడు సౌదీఅరేబియా కూడా యుద్ధ బాధిత దేశంగా ఉండడంతో డిఎపి సరఫరా దెబ్బతింటోంది. భారతదేశానికి సరఫరాలో ఇబ్బందులే కాకుండా దిగుమతుల వ్యయం బిల్లుకూడా అమాంతంగా పెరిగే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని వాణిజ్యవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# పర్యాటకుల కోసం హోటల్ గదులు, హోమ్ స్టేలను పెంచండి

- మొదటి పేజి తరువాయి

గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరఘాట్‌ను ఆగస్టు నాటికి, హావ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.

**పర్యాటక ప్రోత్సాహానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ**

రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సీఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హౌస్ బూట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని అన్నారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకనామినీ ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు.

బాలివుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకనామీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్ కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని, ఈ ఏడాదిలో 9 నెలల కాలానికి గానూ 21 శాతం మేర వృద్ధి కనిపించిందని, ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీ వసూలు చేయొద్దు
### హెటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

హోటళ్లు, రెస్టారెంట్లకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్పీజీ పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. గ్యాస్ కొరతను చూపిస్తూ అదనపు సేవల ఛార్జీ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పేరుతో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సీసీపీఏ స్పందించింది. ఎల్పీజీ గ్యాస్ పేరుతో కొన్నిహోటళ్లు, రెస్టారెంట్లు వినియోగదారుల నుంచి అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి

వచ్చినట్లు తెలిపింది. హెల్ప్ లైన్ నెంబర్లకు ఫిర్యాదులు వచ్చాయని, మీడియాలో కూడా వార్తలు వచ్చాయని వెల్లడించింది. మెనూలో పేర్కొన్న ధరలను మాత్రమే వసూలు చేయాలని, అదనంగా ఎలాంటి చార్జీలు ఉండకూడదని స్పష్టం చేసింది.

## జగన్ జీవితం జంగిల్ బుక్ లాంటిది

వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జీవితం 'జంగిల్ బుక్'లా మారిందని ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అరాచకం, అబద్ధాలు తప్పించి వాస్తవాలను ఏనాడూ మాట్లాడని నాయకత్వం ఆయనదేనని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, ప్రజా ధనం దోపిడీ చేసి రాష్ట్రాన్ని దెబ్బతీశాడని ఆరోపించారు. అందుకే ప్రజలు ఆయనకు గట్టి బుద్ధి చెప్పి కేవలం 11 అసెంబ్లీ సీట్లకే పరిమితం చేశారని అన్నారు. ప్రజా తీర్పును గౌరవించకుండా, అసెంబ్లీకి రాకుండా బయట విమర్శలు చేయడం ఆయన బలహీనతకు నిదర్శనమని అన్నారు. గతంలో ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, హెచ్‌ఎస్‌బీసీ, ఐబీఎం వంటి ప్రముఖ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసింది నాటి జగన్ ప్రభుత్వమేనని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ పరిస్థితులను మార్చి గూగుల్, టీసీఎస్, ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్, ఐబీఎం వంటి ప్రతిష్ఠా త్మక సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తోందని పేర్కొన్నారు. ఇది తమ ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనమని మంత్రి అన్నారు. జగన్ పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తూ పెట్టుబడులకు స్వర్గధామిగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతోందని అన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు లభిస్తున్న ఉపాధి అవకాశాలు, వేగంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. అందుకే ప్రతిసారి గుమ్మం కూడా దాటకుండా ఇంట్లో ప్రెస్ మీట్ ద్వారా లేదా తన పార్టీ నేతలతో సమావేశమై కూటమి ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకొని పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, దుష్ప్రచారాలు చేసినా ప్రజలు తమ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని ఏమాత్రం దెబ్బతీయలేరని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతుందని జనార్ధన్ రెడ్డి అన్నారు.

## అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..

రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులందరూ ఒకే చోట కొలువుదీరేలా నిర్మిస్తున్న ఐదు ఐకానిక్ టవర్ల పనులు వేగవంతమయ్యాయి. ఈరోజు హెచ్‌ఓడీ టవర్-3 వద్ద 'కార్నర్ నోడ్' అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యాధునిక డయాగ్రిడ్ సాంకేతికతతో ఈ భవనాలను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అమరావతి నిర్మాణానికి ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ద్వారానే ఈ నిధులు సమకూరుతున్నాయని, అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ' అని ఆయన గుర్తు చేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల సుమారు 4 నెలల పాటు పనులకు అంతరాయం కలిగిందని, ఇప్పుడు పనుల వేగాన్ని పెంచామని తెలిపారు. ఐకానిక్ భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాస సముదాయాల పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని వివరించారు.

రాయపూడి వద్ద జరిగిన అగ్నిప్రమాదంపై సీఎం ఇప్పటికే సమీక్షించారని, ఒకవేళ ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రమాదానికి పాల్పడి ఉంటే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రస్తుతం దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని చెప్పారు.

**డయాగ్రిడ్ టెక్నాలజీ అంటే ఏమిటి?**

ఈ టవర్ల నిర్మాణంలో వాడుతున్న డయాగ్రిడ్ టెక్నాలజీ వల్ల భవనానికి లోపల పిల్లర్లు ఉండాల్సిన అవసరం తక్కువగా ఉంటుంది. దీనివల్ల లోపల స్థలం ఎక్కువగా లభిస్తుంది. ఉక్కును త్రిభుజాకారపు గ్రిడ్లుగా అమర్చడం వల్ల భవనానికి అద్భుతమైన పటుత్వంతో పాటు ఒక ఆధునిక లుక్ వస్తుంది.

## 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు

ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. "ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు" అని కోర్టు వ్యాఖ్యానించింది.

పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు.

అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని,

చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం... 3 వేల లక్ష్యాలపై దాడులు

- మొదటి పేజి తరువాయి

ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలిపారు. అయితే ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ చెబుతోంది.

## చంద్రబాబుకు భయపడొద్దు..

- మొదటి పేజి తరువాయి

చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

## భాగ్యనగరంలో ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

భాగ్యనగరంలో ప్రయాణికులకు టీజీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నగర పరిధిలోని మెట్రో, ఏసీ డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కొరత వార్తల నేపథ్యంలో ప్రయాణికులకు ఆర్టీసీ ఊరటనిచ్చే వార్త చెప్పింది.

ఈ సందర్భంగా ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి స్పందిస్తూ, "పెట్రోల్ కష్టాలు పడటం ఎందుకు దండగ, ఆర్టీసీ బస్సులు ఉండగ" అంటూ వ్యాఖ్యానించారు. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరవద్దని, సురక్షితంగా బస్సులోనే ప్రయాణించాలని సూచించారు.

## అమెరికా విమాన వాహకనౌక లక్ష్యంగా క్షిపణి దాడులు చేశాం

ఇరాన్‌పై దాడులను ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించిన రెండు రోజుల అనంతరం, అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడులు చేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వం ప్రకటన చేసింది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక వైపు తాము క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసింది. దీనిని అమెరికా ధృవీకరించవలసి ఉంది. ఈ విమాన వాహక నౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, దానిని లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఆ తర్వాత గంటలోపు క్షిపణి దాడి జరగడం గమనార్హం. ఇందుకు సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ఇదివరకు కూడా ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దీనితో అది పని చేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల ఇరాన్ ప్రకటించగా, అమెరికా తోసిపుచ్చింది.

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

- మొదటి పేజి తరువాయి

చంద్రబాబునాయుడు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు-ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌లు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# సైబర్ నేరాలు గుడ్ టచ్ బాడ్ టచ్ లపై విద్యార్థులకు అవగాహన



**పొన్నలూరు,పెన్ పవర్ మార్చి 25**

మైనర్లపై లైంగిక వేధింపుల కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో వారికి రక్షణ కల్పించడానికి ఫోక్సో చట్టం ఎంతో అవసరమై ఎస్సై పి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని మాలెపాడు లోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ ఫోక్సో చట్టం పిల్లల హక్కులను కాపాడుతుందని వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తుందని అన్నారు. ఫోక్సో చట్టంతో పాటు సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ కలిగే దుష్పలితాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

# పెట్రోల్ దొరకదనే వదంతులతో ఖాళి అయిన పెట్రోల్ బంకులు





**కొమరోలు పెన్ పవర్ మార్చి 25**

ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోల్ కొరత ఏర్పడుతుందనే భయాందోళనతో వినియోగదారులు అవసరానికి మించి పెట్రోలు పోషించుకుంటూ పోతున్నందువల్ల కొమరోలు లోని పెట్రోల్ బంకులు బుధవారం ఖాళీ అయ్యాయి.దీనితో కొందరు వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొమరోలులో మూడు పెట్రోల్ బంకులు ఉన్నాయి. అలాగే తాటిచెర్ల మోటు సమీపంలో మరో పెట్రోల్ బంకు ఉన్నది. అయితే గత రెండు రోజులుగా ఇక పెట్రోలు దొరకదనే వదంతులు వ్యాపించడంతో వినియోగదారులు అవసరానికి మించి పెట్రోలు పొందుతున్నారు. దీనితో పెట్రోల్ బంకులలో పెట్రోల్ కొరత ఏర్పడింది. బుధవారం ఉదయం కొమరోలు కు దక్షిణం వైపున ఉన్న పెట్రోల్ బంకులు ఉత్తరం వైపున సాయిబాబా గుడి సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులు పెట్రోల్ కొరత ఏర్పడంతో పెట్రోల్ బంకుల నిర్వాహకులు నో స్టాక్ బోర్డులు పెట్టారు. ఇక కొమరోలు ఉత్తరం వైపున డ్రీమ్ రెస్టారెంట్ ఎదురుగా గల పెట్రోల్ బంకులు అరకొరగా స్టాక్ ఉండడంతో వినియోగదారులు తమ వాహనాలతో ఆ పెట్రోల్ బంకు వద్ద బారులు తీరారు. పెట్రోల్ కొరతపై పెట్రోల్ బంకుల యజమానులను ప్రశ్నించగా, తమ బంకులకు పెట్రోల్ సక్రమంగా సరఫరా అవుతున్నదని, అయితే గత రెండు రోజులుగా వ్యాపిస్తున్న వదంతులతో ఆందోళన చెందిన వినియోగదారులు పెట్రోలు దొరకదని ఆందోళనతో అవసరానికి మించి పెట్రోల్ పోయించుకుంటున్నారని, సాధారణంగా రోజుకు తమకు 1000 లీటర్ల వరకు వ్యాపారం జరిగేదని ,అయితే గత రెండు రోజులుగా రోజుకు మూడు నుంచి నాలుగు వేల లీటర్ల వరకు వ్యాపారం జరుగుతున్నదని వారు తెలిపారు. మంగళవారం ఉదయం తమ పెట్రోల్ బంకు కు ఐదువేల లీటర్ల స్టాక్ వచ్చిందని, అయితే బుధవారం ఉదయానికి 5,000 లీటర్లు విక్రయం జరిగిందని ఒక పెట్రోల్ బంక్ యజమాని తెలిపారు .పెట్రోలు దొరకదనే వదంతులు వ్యాపించడంతో 50 రూపాయలకు, వంద రూపాయలకు పెట్రోల్ పోయించుకునే ద్విచక్ర వాహనదారులు ఏకంగా ఫుల్ ట్యాంకు చేయించుకుంటున్నారని, అంతేగాక కొందరు క్యాన్లు తెచ్చుకొని పెట్రోలు కొనుగోలు చేస్తున్నట్లుగా పెట్రోల్ బంక్ ల యజమానులు చెబుతున్నారు . కొందరు క్యాన్లలో పెట్రోల్ పోయించుకుని వెళ్తూ రిటైల్ గా ఎక్కువ ధరలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా వినియోదారులు చెబుతున్నారు .తమకు ప్రతిరోజు పెట్రోల్ సరఫరా జరుగుతున్నదని అందువల్ల ఎలాంటి కొరత ఉండదని తాము వినియోగదారులకు నచ్చ చెబుతున్నప్పటికీ వారు తమ మాటలు విశ్వసించక తమ అవసరానికి మించి పెట్రోల్ పోయించుకుని వెళ్తున్నారని వారు తెలిపారు. భయాందోళనతో వినియోగదారులు అవసరానికి మించి పెట్రోలు పొందడంతో తమ పెట్రోల్ బంకులలో బుధవారం ఉదయానికి పెట్రోల్ నిల్వలు ముగిసిపోయాయని, అయితే బుధవారం రాత్రికి లేదా గురువారం ఉదయానికి పెట్రోల్ ట్యాంకులు చేరుకుంటాయని, అందువల్ల వినియోగదారులు వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. ఇక డీజిల్ కొరతలేదని డీజిల్ కొరకు పెద్దగా ఎవరు అవసరానికి మించి పోయించుకోవడంలేదని వారు తెలిపారు. అవసరానికి మించి పెట్రోలు ఉంది క్యాన్లలో ఇళ్లలో నిలువ ఉంచుకోవడం వల్ల పెట్రోలు ఆవిరి కావడమే కాకుండా వేసవికాలంలో ప్రమాదాలు కూడా జరిగే అవకాశాలు కూడా ఉన్నాయని అందువల్ల వినియోగదారులు తమ ఇళ్ళలో పెట్రోలు నిలువ ఉంచుకోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు .నిన్న మొన్నటి వరకు వరకు ఎల్పిజి సిలిండర్లు కూసిలిండర్లు దొరకవనే వసంతులు వ్యాపించడంతో గృహ వినియోగదారులు ఆందోళన చెందారు. అయితే ఆన్లైన్ ద్వారా బుక్ చేయించుకున్న వినియోగదారులకు గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లను సరఫరా చేస్తున్నందువల్ల ప్రజలలో భయాందోళన తగ్గిపోయింది.

## ఎమ్మెల్యే ముత్తుముల చొరవతో దశాబ్దాల

# భూ సమస్యకు పరిష్కారం..

## ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు..



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 25**

గిద్దలూరు పట్టణం లోని రేడియో బావి సెంటర్ వాసులు గత కొన్ని దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఓ ప్రధాన భూ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కృషితో ఈ ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమమైంది. గిద్దలూరు పట్టణంలోని రేడియో బావి సెంటర్ ప్రాంతంలో సర్వే నెంబర్ 435/1 కింద అనేక ప్రైవేట్ ఆస్తులు, ఇళ్లు ఉన్నాయి. అయితే, గత కొన్ని దశాబ్దాలుగా ఈ భూములు పొరపాటున , సాంకేతిక కారణాల వల్ల స్థానిక శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ భూముల జాబితాలో (నిషేధిత ఆస్తుల కింద) ఉండిపోయాయి. దీని కారణంగా దశాబ్దాలుగా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సొంత ఆస్తులను అత్యవసర పరిస్థితుల్లో అమ్ముకోవాలన్నా, కొత్తగా కొనుగోలు చేయాలన్నా , రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా చట్టపరంగా వీలుకాక నానా అవస్థలు పడ్డారు. ఆస్తి పత్రాలు ఉన్నా, వాటి పై హక్కులు చెలాయించలేని నిస్సహాయ స్థితిలో ఆ ప్రాంత వాసులు ఉండిపోయారు. ఈ దీర్ఘకాలిక సమస్యను అక్కడి ప్రజలు గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను, వారి మనోవేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే ఈ సమస్య పరిష్కారానికి నడుంబిగించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఆయన పలుమార్లు జిల్లా కలెక్టర్ ని స్వయంగా కలిసి పరిస్థితిని వివరించారు. రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులతో సమీక్షలు జరిపి, అవి ప్రైవేటు ఆస్తులే అని నిరూపించేలా దస్త్రాలను పరిశీలించి, అధికారులకు తగిన ఆధారాలు సమర్పించడంలో ప్రజలకు అండగా నిలిచారు. ప్రభుత్వ స్థాయిలో నిరంతరం ఒత్తిడి తెచ్చి, ఈ ఫైలు ముందుకు కదిలేలా శ్రమించారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కృషి ఫలించి సర్వే నెంబర్ 435/1 లో ఉన్న ప్రైవేటు వ్యక్తుల ఆస్తుల పై ఉన్న ఆంక్షలను తొలగిస్తూ జిల్లా కలెక్టర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తాజా ఉత్తర్వుల ప్రకారం, గిద్దలూరు తహసీల్దార్ కూడా ఆన్లైన్ లో మార్పులు చేయటంతో ఇకపై ఆ ప్రాంత వాసులు ఎలాంటి ఆటంకాలు లేకుండా తమ ఆస్తులను అధికారికంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు, అలాగే క్రయవిక్రయాలు (అమ్మకాలు, కొనుగోళ్లు) స్వేచ్ఛగా జరుపుకోవచ్చు. కలెక్టర్ ఉత్తర్వులు వెలువడటంతో రేడియోబావి సెంటర్ ప్రాంత వాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఏళ్ల నాటి తమ ఆస్తుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, తమ కుటుంబాలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కి ఆ ప్రాంత ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమ దశాబ్దాల కల నెరవేర్చిన ఆయన సేవలను కొనియాడుతూ హర్షం వ్యక్తం చేశారు.

# ఆస్తి పన్నుపై వడ్డీకి 50 శాతం రాయితీ

## మార్చి 31 వరకే రాయితీ వర్తింపు



గిద్దలూరు పెన్ పవర్ మార్చి 25

గిద్దలూరు పట్టణంలోని ఆస్తి పన్ను బకాయిదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని. ఏళ్లుగా పేరుకుపోయిన పన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీని ప్రకటించగా, ఈ అవకాశాన్ని ప్రజలు తప్పక వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మార్చి 31లోపు పాత బకాయిలతో పాటు ప్రస్తుత సంవత్సర పన్నును ఒకేసారి చెల్లిస్తేనే ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. గడువు ముగిసిన తర్వాత పూర్తి వడ్డీతోనే పన్నులు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సదుపాయం ద్వారా ప్రజలు తమ వడ్డీ భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని, ఇదొ మంచి అవకాశం అన్నారు. కుళాయి పన్నులు, ఖాళీ స్థల పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా సమయానికి చెల్లించాలని సూచించారు. గిద్దలూరు మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే ప్రతి ఒక్కరు చేయి కలపాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

# సమయానికి రారు... వచ్చినా ఉండరు

## ఓగూరు సచివాలయంలో ఒక్క ఉద్యోగి ఉంటే ఒట్టు -అధ్వానంగా సచివాలయాల పనితీరు

### -పట్టించుకోని అధికారులు -ఇష్టారీతిన ఉద్యోగులు

### - ఎమ్మెల్యే ఇంటూరి ఆగ్రహం వ్యక్తం చేసిన మారని తీరు






**కందుకూరు పెన్ పవర్ మార్చి 25**

నియోజకవర్గంలో ఎక్కువ శాతం సచివాలయాలలో ఉద్యోగులు అందుబాటులో ఉండకపోవడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాలలో పట్టణాలలో ఏ సమస్యలు ఉన్న అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టింది. ఏ చిన్న పని కావాలన్నా సచివాలయాలకు ప్రజలు వెళ్తారు. కానీ అక్కడ సమయానికి రారు వచ్చినా ఉండరు అన్న విధంగా వారి పనితీరు పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్చి 25 నుంచి ప్రభుత్వం సచివాలయాలలో సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోమని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఓగూరు సచివాలయం కు ప్రజలు వెళ్లగా అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రజలు ఆశ్చర్యపోయారు. ఎక్కడికి వెళ్లారు అని అడిగితే సర్వేల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అనేకసార్లు ఆకస్మికంగా సచివాలయాలను తనిఖీ చేయగా ఎమ్మెల్యే సైతం నివ్వెర పోయిన పరిస్థితి ఉంది. సర్వేల పేరుతో ఎవరిని మోసం చేస్తారు అంటూ అధికారులను వీరిపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు అని ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ వారి పనితీరులో మార్పు రాకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది. ఎంపీడీవో కార్యాలయానికి ఓగూరు ప్రజలు ఫోన్ చేసినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వారిపై తగిన చర్యలు తీసుకోని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

# తూతు మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం




**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 25**

మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం బుధవారం తూతూ మంత్రంగా సాగింది. ఎంపీపీ కొండా బత్తిన మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఏఎంసి చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, జడ్పిటిసి సభ్యులు బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పి సుజాత హాజరయ్యారు. అధికారులు తమ శాఖల ద్వారా జరిగే పథకాలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజా ప్రతినిధులు సమస్యలపై చర్చించకుండా కేవలం అధికారుల ప్రసంగాలతో ముగించేశారు. సమస్యలపై ఎవరు చర్చించకపోవడంతో గంటలోపే సమావేశం ముగించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్పర్సన్లు ఉన్నం కొండలరావు, మన్నెం రమణయ్య, సర్పంచులు షేక్ చిన్న మస్తాన్, అనుమోలు ప్రసాద్, లెక్కల వెంకటేశ్వర్లు, రంగయ్య ఎంపీటీసీలు కాట్రగడ్డ నరసింహారావు, రామాంజనేయులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సులో దొరికిన బంగారాన్ని పోలీసులకు అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది

## ప్రశంసతో పాటు సన్మానించిన పోలీసులు

**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 25:**
ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు మరచిన బంగారాన్ని ఆ బస్సు కండక్టర్, డ్రైవర్ పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడ్లూరుకు చెందిన దేవరకొండ వెంకాయమ్మ తన యొక్క బంగారు బ్రాస్లెట్ ను మాచవరం బ్యాంకులో తనకాపెట్టి డబ్బులు తీసుకొనుట కొరకు వెళ్లగా, బ్యాంక్ లో పని అవ్వకపోవడంతో, తిరిగి గుడ్లూరు రావడానికి కందుకూరు డిపోకు చెందిన ఏపీ 27 టీజడ్ 0808 అను బస్సులో ఎక్కి తన యొక్క గోల్డ్ ను బస్సులో మర్చిపోయి గుడ్లూరులో దిగినది. దిగిన తర్వాత బస్సులో గోల్డ్ మర్చిపోయాను అన్న విషయం గుర్తుకు రావడంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేయగా, వెంటనే స్పందించిన పోలీస్ స్టేషన్ లో ఉన్న సిబ్బంది ఉషారాణి, లక్ష్మణస్వామి, డ్రైవర్ సురేంద్రలు వెంటనే ఎస్ఐ వెంకట్రావుకు సమాచారం చేరవేశారు. వెంటనే ఎస్సై బస్సు కండక్టర్ ని కాంటాక్ట్ అవ్వగా ఈలోపు బస్సు కండక్టర్ సీటులో ఉన్న బ్రాస్లెట్ చూసి తన వద్ద ఉంచుకొని, వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఈ సమయంలో బస్సు కండక్టర్ నిజాయితీగా గోల్డ్ తీసుకొని గుడ్లూరు



పోలీస్ స్టేషన్ కు వచ్చి బాధిత మహిళ దేవరకొండ వెంకాయమ్మకు అందించాడు. దీనితో తను బస్సులో పోగొట్టుకున్న గోల్డ్ ను అందుకున్న వెంకాయమ్మ, ఆమె కుటుంబ సభ్యులు బస్సు కండక్టర్ చంద్రమోహన్



రావుకు, డ్రైవర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంఘటనలో బస్సు కండక్టర్ చంద్రమోహన్ రావు మరియు డ్రైవర్ నిజాయితీగా గోల్డును తీసుకొని వచ్చినందుకు వారికి స్థానిక ఎస్సై వెంకట్రావు శాలువాతో సత్కరించి, ప్రశంశను అందజేశారు.

# పేదలకు దుస్తులు పంపిణీ



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ మార్చి 25**
మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు వాడిన దుస్తులను పంపిణీ చేసే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు తమ ఇళ్లలో ఉపయోగించకుండా ఉన్న ప్యాంట్లు, షర్టు, చిన్నపిల్లల దుస్తులు, చీరలు తదితర వస్త్రాలను సేకరించి అవసరమైన వారికి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సంస్థ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఇంకా ఎన్నో పేద కుటుంబాలు ప్రాథమిక అవసరాల కోసం కష్టపడుతున్నాయని అన్నారు. మన ఇళ్లలో ఉపయోగించకుండా ఉన్న దుస్తులు వారికి ఎంతో ఉపయోగపడతాయని, వాటిని శుభ్రంగా సర్ది అందించడం ద్వారా వారి జీవితాల్లో చిన్న సంతోషాన్ని తీసుకురాగలమన్నారు. ఇది కేవలం దానం మాత్రమే కాకుండా మానవత్వానికి నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తడికమల్ల శ్రీనివాసులు, పి.వి. కృష్ణారావు, అనుముల ఆంజనేయులు, బచ్చు సుబ్రహ్మణ్యం, ఆర్కే జి, గోరంట్ల చిన్న వెంకట్ రెడ్డి, కలవ భాస్కర్, ఆమంచి చంద్రశేఖర్, ఊటుకూ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# మౌలాలి కుటుంబాన్ని పరామర్శించిన ముస్తాక్ అహ్మద్



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ మార్చి 25**
టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి సతీమణి ఇటీవల మృతి చెందారు. బుధవారం ఏపీ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, టీడీపీ విధానాలు, ముస్లిం మైనారిటీల అభివృద్ధిపై వివరించారు. మార్కాపురంలో షాది ఖానా నిర్మాణం అవసరాన్ని ప్రస్తావిస్తూ, త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ సాదిక్, టీడీపీ సీనియర్ నాయకులు మొగల్ ఫిదా హుస్సేన్ బేగ్, ఖాన్, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మొగల్ జాబీర్ హుస్సేన్ బేగ్, ఉపాధ్యక్షులు చిన్న కాసిం, మొగల్ షాకీర్ హుస్సేన్ , కౌన్సిలర్ చిన్న షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# యాప్ లో సాంకేతిక లోపాలను సవరించండి..

## ఎంపీడీవోకు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి...



**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 25**
ఉపాధి హామీ పనుల అమలులో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ సరిగా పనిచేయక పోవడంతో కూలీల హాజరు నమోదు చేయడం కష్టంగా మారుతోందని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి బుధవారం ఎంపీడీవో మరియదాసును కలిసి సమస్యలను వివరించారు. ప్రతిరోజూ వందలాది మంది కూలీలు పనులకు హాజరవుతున్నప్పటికీ, యాప్ సాంకేతిక లోపాల కారణంగా హాజరు నమోదు సక్రమంగా జరగడం లేదని చెప్పారు. యాప్ ఓపెన్ కాకపోవడం, ఫోటోలు అప్‌లోడ్ కాకపోవడం, సర్వర్ పనిచేయకపోవడం వంటి సమస్యలు తరచుగా ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యల వల్ల పనికి వచ్చిన కూలీల హాజరు నమోదు కాక, వేతనాల చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు కూడా ఉండటంతో యాప్ వినియోగం మరింత క్లిష్టంగా మారుతోందన్నారు. కూలీలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ విధానం కల్పించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ల వినతిని స్వీకరించిన ఎంపీడీవో మరియదాసు, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఉపాధి హామీ పనులు సజావుగా కొనసాగేందుకు యాప్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# వైభవంగా అర్చక పురోహితులకు పంచాంగాల పుస్తకాల పంపిణీ

## సేవా కార్యక్రమంలో సాయి మనోజ్



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 25**
నూతన (పరాభవ నామ) సంవత్సర సందర్భంగా కనిగిరి లోని స్థానిక బ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా పంచాంగ పుస్తకాల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. 'పరాభవ' నామ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, కనిగిరి నియోజకవర్గానికి చెందిన జాతీయ యువజన కార్యదర్శి సంగరాజు సాయి మనోజ్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. సంగరాజు సాయి మనోజ్ జాతీయ స్థాయి పదవిని చేపట్టిన తర్వాత తొలిసారి వచ్చిన సందర్భంగా, కనిగిరి ప్రాంతంలోని అర్చక పురోహితులందరికీ నూతన సంవత్సర పంచాంగాలను అందజేశారు. కేవలం పంచాంగాలే కాకుండా, కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారి ప్రత్యేక అనుగ్రహంతో పొందిన ఆధ్యాత్మిక పత్రాలను కూడా స్వామివారి ఆశీస్సులతో పురోహితులకు పంపిణీ చేయడం విశేషం. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు వినుపాముల రామకృష్ణ శర్మ ,సాయి మనోజ్ ను వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా సత్కరించి,



ఆశీర్వచనాలు అందజేశారు. యువకుడైన మనోజ్ జాతీయ స్థాయిలో కీలక పదవిని పొందడం పట్ల కనిగిరి అర్చక సంఘం హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనను ఆశీర్వదించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ?ముఖ్యఅతిథులుగా ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కళ్యాణ మండపం చైర్మన్ ధూళిపాళ్ల వీరభద్రరావు, శానికొమ్ము జగన్ మోహన్ రెడ్డి, శివాలయం డైరెక్టర్ సూరపరాజు తులసి, మరియు పెద్ద సంఖ్యలో అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు. బ్రాహ్మణ సమాజ సంక్షేమానికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సాయి మనోజ్ చూపిస్తున్న చొరవను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమం కనిగిరి బ్రాహ్మణ సేవా సంఘం మరియు స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది. ఈ కార్యక్రమం లో అర్చకులు పురోహితులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణస్వామి హుండీల ఆదాయం రూ.5,07,617/-



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 25**
జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం లో బుధవారం కందుకూరు డివిజన్ ఇన్స్పెక్టర్ జి ఏ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ సమక్షంలో హుండీలు లెక్కించగా ఆదాయం 5 లక్షల 7 వేల 617 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క నెల ఏడు రోజులకు సంబంధించిన హుండీలు లెక్కించగా మెయిన్ హుండీల ద్వారా రూ.4,41,533/- లు, అన్నదానం హుండీల ద్వారా రూ.66,084/- లు వచ్చినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఉచిత సేవాదారులు పాల్గొన్నారు.

# పొదిలిలో పొగాకు వేలం కేంద్రం ప్రారంభం



**పొదిలి, పెన్ పవర్, మార్చి 25**
పొదిలిలో పొగాకు వేలం కేంద్రం ప్రారంభమైంది. బుధవారం నాడు పొగాకు వేలం కేంద్రాన్ని గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. విశ్వ శ్రీ లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా పూజా కార్యక్రమాలను నిర్వర్తించిన ఆమె వేలం కేంద్రంలో పాల్గొని పొగాకు విక్రయాల ను పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వశ్రీ మాట్లాడుతూ ఈ ఏడాది నాణ్యమైన పొగాకు దిగుబడి వచ్చిందని, అందువల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు ఉన్నట్లు ఆమె చెప్పారు. కాగా ప్రారంభంలోనే నాణ్యమైన పంట కిలో 28 రూపాయలతో ప్రారంభం కాగా 25 రూపాయల ధర పలకడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభంలోనే ధరలు ఆశాజనకంగా లేవని రైతులు పెదవి విరిచారు. ఈ కార్యక్రమంలో పొదిలి పొగాకు వేలం నిర్వహణ అధికారి తో పాటు సిబ్బంది , వివిధ కంపెనీలకు చెందిన బయ్యర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యం

## ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, మార్చి 25**
ప్రయాణికులకు అన్ని విధాల మెరుగైన సేవలు అందించడమే తమ సంస్థ ప్రధాన లక్షమని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి చెప్పారు. బుధవారం నాడు పొదిలి పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో కె విజయ భాస్కర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్. ఓ వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థకు ప్రయాణికులే అతి ప్రధానమైన వ్యక్తులుగా ఆయన అభివర్ణించారు. అందువల్ల ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సురేష్ రెడ్డి చెప్పారు. దాతల సహకారంతో ప్రతి ఆర్టీసీ బస్ స్టేషన్ లో ఆర్. ఓ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని లక్ష్యంతో కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. శ్రీ శక్తి పథకం వల్ల



మహిళల రద్దీ పెరిగిందని, అయితే అందుకు అనుగుణంగా బస్సులను కూడా పెంచేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని సురేష్ రెడ్డి చెప్పారు. ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణాలు సాగించడం ద్వారా సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ వి. శంకరరావు, బిజెపి నాయకులు బెల్లంకొండ విజయలక్ష్మి, సయ్యద్ ఖాదర్ భాష, డి రమణారెడ్డి, ఎస్ కె భాష తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరు చట్టాలకు లోబడి ప్రవర్తించాలి

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 25**
ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ షేక్. ఇబ్రహీం షరీఫ్ బుధవారం గిద్దలూరు సబ్ జైలు ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైల్ లో ఉన్న ప్రతి ఒక్కరి కేసుల వివరములను అడిగి తెలుసుకున్నారు . ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ప్రవర్తించాలన్నారు. బెయిల్ పొందిన తర్వాత, విడుదల అయిన విచారణ ఖైదీలు, సదరు కేసు పూర్తయ్యే వరకు, ప్రతి వాయిదాకు కోర్టు ముందు తప్పక హాజరు కావాలన్నారు.నేర ప్రవృత్తి ని విడిచిపెట్టి , బాధ్యత కలిగిన మంచి పౌరులుగా మెలగాలన్నారు. మద్యం త్రాగి వాహనాలు నడపటం నేరమన్నారు. మంచి మార్పు రావటం కోసమే , చట్ట విరుద్ధముగా ప్రవర్తించినవారిని జైల్లో ఉంచుతారన్నారు .అరెస్ట్,



బెయిల్,సింగిల్ స్యూరిటి, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు . ఆర్థిక స్తోమత లేని వారికి, వారి కేసులను పూర్తి చేయడానికి, మండల న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని పొందవచ్చు అన్నారు. ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలను, ఆహార పదార్ధములను, సరుకుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్ , గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె. భరత్ చంద్ర, లీగల్ ఎయిడ్ న్యాయవాది బి. రాజ్ కుమార్ నాయక్ ,పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు, సబ్ జైల్ సూపర్డెంట్ యూ. లింగారెడ్డి, సబ్ జైల్ సిబ్బంది, విచారణ ఖైదీలు పాల్గొన్నారు.

# చేవూరు రైతుసేవాకేంద్రశీలో విజ్ఞానయాత్ర కార్యక్రమం

## ప్రకృతి వ్యవసాయంపై పలు సూచనలు అందించిన అధికారులు.





**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 25**

మండలంలోని చేవూరు రైతుసేవాకేంద్రశీ పరిధిలోని చేవూరు, రావూరు గ్రామముల నందు ఆత్మ ప్రకాశం వారి సౌజన్యంతో విజ్ఞాన యాత్ర కార్యక్రమం జరిగినది. రైతులకు ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే కషాయాల తయారీ విధానాన్ని ఎం.మౌనిక ఏటీఎం మోడల్ నందు మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ అధ్యక్షతన చూపించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవికుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగంలోని ఆధునికీకరణ పద్ధతి అయిన ఏటీఎం పద్ధతిలో కాషాయాల వినియోగం ద్వారా పంటసాగు విధానాన్ని గురించి రైతులకు తెలియజేస్తూ రైతులు తమకున్న పొలంలో 10 సెంట్లు నుంచి 30 సెంట్ల స్థలములో ఆకుకూరలు కూరగాయలు పండించుకొని ప్రతిదినం ఆహారంలో భాగంగా చేర్చుకోవడం ద్వారా విషరహిత ఆహారం తినడమే కాకుండా మంచి ఆరోగ్యం, అధిక ఆదాయం పొందవచ్చు అని తెలియజేశారు. ఏటీఎం పద్ధతిలో క్యారెట్, బీట్రూట్, ముల్లంగి, తోటకూర, చిర్రికూర, చుక్క కూర, మెంతికూర, గోంగూర, బీర, కాకర, సొర, మునగ, మొక్కజొన్న, బీన్స్, దొండ, కీరదోస వంటి తదితర ఆకుకూరలు, కూరగాయలను అనగా కనీసం 25 రకాల విత్తనాలను ఉపయోగిశీచి పండిస్తారు. వివిధ కాషాయాలను ఉపయోగించి సాగుచేసిన వరి, అరటి, ఆకుకూరలు మరియు కూరగాయలను పరిశీలించడం జరిగినది. రావూరులో ఉన్న గోశాలను సందర్శించి గోమూత్రం మరియు ఆవు పేడ విశిష్టత గురించి ఎఫ్.ఎమ్.టీ రేవతి వివరించడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమములో ఆత్మ ఏటీఎం టీ.వీరాంజనేయ కేశవ, చేవూరు వీఏఏ కె.శ్రీచరిత, బీ.ఆర్.సీ రాఘవ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు వివిధ ప్రాంతాల నుండి విజ్ఞాన యాత్రకు వచ్చిన రైతులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్బంగా అన్నక్యాంటీన్‌లో ఉచిత అన్నదాన కార్యక్రమం



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 25**

కొమరోలు మండలం, దద్దవాడ పంచాయతీ గోవిందపల్లె గ్రామానికి చెందిన ఎం ఆర్ ఐ టీడీపీ సభ్యులు, రావూరిచంద్రమోహన్ జన్మ దినోత్సవం పురస్కరించుకుని గిద్దలూరు అన్నక్యాంటీన్ లో బుధవారం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి పేద ప్రజలకు ఉచితంగా అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారి మిత్ర బృందం, తెలుగుదేశం పార్టీ నాయకులు దూదేకుల దస్తగిరి, బొర్రా రాఘవేంద్ర యాదవ్, ఎంవీ సాయి, కాళీ రమేష్ , ఇతర ముఖ్య నేతలు పాల్గొని, స్వయంగా ప్రజలకు వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ.. పేదల ఆకలి తీరుస్తున్న ఏపీ సీఎం శ్రీ నారా చంద్రబాబు నాయుడు కు, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారి మిత్ర బృందం ప్రజలతో కలిసి చంద్రమోహన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం హుండీల లెక్కింపు



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మార్చి 25**

పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ లెక్కింపు కార్యక్రమం దేవస్థానం కార్యనిర్వాహక అధికారి గొలమారి శ్రీనివాసులు రెడ్డి, దేవాలయ ఇన్స్పెక్టర్ ఆర్.కే. చైతన్య పర్యవేక్షణలో పారదర్శకంగా జరిగింది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, గతంలో 84 రోజులకు హుండీ ద్వారా రూ.6,33,012 ఆదాయం సమకూరగా, ప్రస్తుతం 91 రోజుల వ్యవధికి గాను రూ.10,81,510 ఆదాయం నమోదైంది. గతంతో పోలిస్తే ఈసారి హుండీ ఆదాయం గణనీయంగా పెరగడం విశేషంగా నిలిచింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి స్వామివారికి మొక్కులు చెల్లించడం, విరాళాలు సమర్పించడం వల్లే ఈ పెరుగుదల నమోదైనట్లు దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.

# మాలపాడులో ఉచిత పశు వైద్య శిబిరం

**పొన్నలూరు పెన్ పవర్ మార్చి 25**

పశుసంపద పెరిగి పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలని కొండపి ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ అన్నారు . మండలంలోని మాలెపాడు గ్రామంలో బుధవారం కొండపి వ్యవసాయ మార్కెట్ వారి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం, రాష్ట్రీయ గోకుల్ మిషన్ పాడి పరిశ్రమ కార్యక్రమం నిర్వహించారు. ఈవో డి ఎల్ డి ఏ మురళీకృష్ణ మాట్లాడుతూ సంతాన ఉత్పత్తికి ఉపయోగపడని పాడి పశువులను పశు వైద్యుల సూచనలతో వైద్యం చేయించి సంతానానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడ దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువుల ఎద ఇంజక్షన్ రాయితీపై రైతులకు రూ 150 కు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం 42 దూడలను ప్రదర్శన చేసి వాటిలో జాతి లక్షణాలు కలిగిన దూడలను ఎంపిక చేసి బహుమతులు ప్రధానం చేశారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి పశు వైద్య అధికారులు డాక్టర్ పి కోటేశ్వరరావు, డాక్టర్ జె శివరామకృష్ణ, ఏ ఎం సి సెక్రెటరీ జి రవికుమార్, పశు సంవర్ధక సహాయకులు మల్లేశ్వరి, గ్రామ నాయకులు కృష్ణారెడ్డి మధు చిన్నబ్బాయి పాడి రైతుల తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన రావూరి కిరణ్

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 25**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆర్ సి సి క్రికెట్ టోర్నమెంట్ కు విచ్చేయుచున్న క్రీడాకారులు మరియు మ్యాచ్ లను వీక్షించుటకు విచ్చేయుచున్న క్రీడాభిమానుల కోసం ఉచిత మజ్జిగ కేంద్రాన్ని రావూరి రత్నం జ్ఞాపకార్థం కుమారుడు రావూరి కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల క్రీడాకారులకు వేసవి వేడిలో చల్లదనాన్ని అందిస్తూ ఆకట్టుకుంటుంది ఈ సందర్భంగా క్రికెట్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత సంవత్సరం మొదటిసారిగా కిరణ్ మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అందరి ప్రశంసలు పొందారని, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా గ్రామ యువత ముందు ఉండటం ప్రశంసనీయమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



# అదుపుతప్పి పొలాల్లోకి వెళ్లిన ప్రైవేటు స్కూల్ బస్సు




**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 25**

ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి పొలాల్లోకి వెళ్లిన సంఘటన బుధవారం మండలం పరిధిలోని సాలిపేట సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై వి.వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు విద్యార్థులతో వెళుతూ, ప్రమాదవశాత్తు బస్సు కంట్రోల్ కాక సాలిపేట-రావూరు గ్రామాల మధ్యలో ఉన్న పొలాల్లోకి వెళ్లడం జరిగినదన్నారు. ఈ పాఠశాల బస్సు సంఘటనలో విద్యార్థులకు ఎవ్వరికి ఎటువంటి గాయాలు అవలేదని ఎస్సై తెలిపారు. విషయం తెలిసిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు కొంత ఆందోళన చెందినప్పటికీ, విద్యార్థులు అందరూ క్షేమంగా ఉండటంలో వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై వెంకట్రావు హుటాహుటిన ఘటన స్థలికి వెళ్లి బస్సు సిబ్బందితో మాట్లాడి, ఘటన జరిగిన తీరును పరిశీలించి, బస్సు డ్రైవర్ కు, సిబ్బందికి విలువైన సూచనలు, సలహాలను అందజేశారు.

# పార్టీ అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలి -దద్దాల



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 25**

కనిగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ ను బుధవారం కనిగిరి పార్టీ కార్యాలయంలో మండలం లోని కంభంపాడు గ్రామమునకు చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ కమిటీలకు సంబందించిన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో పార్టీ అభివృద్ధికి సమన్వయంతో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు మేకల వీరాంజనేయులు, వేల్పుల నారాయణ, నక్కల ప్రభాకర్, నక్కల పరిశుద్ధ, దిబ్బమడుగు రమేష్, శ్యామల సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మేకల వీరాంజనేయులు, వేల్పుల నారాయణ,నక్కల ప్రభాకర్,నక్కల పరిశుద్ధ,దిబ్బమడుగు రమేష్,శ్యామల సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరుటకు దరఖాస్తుల ఆహ్వానం

**వలేటివారిపాలెం, పెన్ పవర్ మార్చి 25**

చుండి ఏపి మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీవెంకటేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో (2026-2027) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల్లో విద్యార్థులు ప్రతి" ఆధారంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభిస్తామని అన్నారు. ప్రవేశాలు పూర్తిగా పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17న నోటిఫికేషన్ విడుదలై 18 నుంచి ఆన్లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. అయితే ఏప్రిల్ 30 వరకు స్వీకరించబడతాయని తెలియజేశారు . అనంతరం ఎంపిక జాబితా విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. మే 6న ధృవీకరణ పత్రాలను పరిశీలించిన తర్వాత ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.150 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని బాలికలకు ఉచిత హాస్టల్ సదుపాయం ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# భీమా ఉంటే జీవితానికి ధీమా ఉన్నట్లే

**కందుకూరు పెన్ పవర్ మార్చి 25**

బీమా ఉంటే జీవితానికి ధీమా ఉన్నట్లే అని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ చెక్ ను పంపిణీ చేసిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వర్లు , కందుకూరు బ్రాంచ్ మేనేజర్ బి. నాగేశ్వరావు , ఎస్.ఎస్.టీ ఆర్థిక అక్షరాస్యత కందుకూరు కేంద్రం కౌన్సిలర్లు మీరా మోహిద్దీన్, అనిల్ కుమార్ లు అందజేశారు. పలుకూరు గ్రామానికి చెందిన షేక్ అఫ్రీన్ షేక్ సుభాని భాష రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో సుభాని బాషా నామిని అయిన మృతుని భార్య షేక్ అఫ్రీన్ కు రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ అందజేశారు. గతంలో అర్థిక అక్షరాస్యత కేంద్రం కందుకూరు కౌన్సిలర్లు, మీరా మొహిద్దిన్, అనిల్ కుమార్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంనకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నాగేశ్వరరావు , ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కౌన్సిలర్లు బ్యాంకింగ్ పథకాలపై, సామాజిక భద్రతా పథకాలపై, డిజిటల్ బ్యాంకింగ్ పై, ప్రైవేటు ఆర్థిక సంస్థల మోసాలపై, ఆన్లైన్ బ్యాంకింగ్ మోసాలపై,అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్మన్,అన్ క్లెయిమ్ డిపాజిట్లు పై అవగహన కల్పించారు. అంతే కాకుండా పి యం యస్ బి వై మరియు పి యం జె జె బి వై భీమా లు ఉంటాయి అని ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కి సంవత్సరానికి 20 రూపాయలు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన సంవత్సరానికి 436 రూపాయల ప్రీమియం చేసుకున్నట్లయితే ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినప్పుడు వ్యక్తికి 2,00,000/-రూపాయిలు ఇన్సూరెన్స్ ఉంటుందని, రూపే ఎటిఎం కార్డు ఉపయోగించినవరికి ప్రమాదవశాత్తు మరణించి నట్లు అయితే 2,00,000 భీమా వస్తుంధి అని తెలియజేసినారు, నా భర్త చనిపోయిన విషయం వారికి తెలియజేయడం జరిగింది. మాకు ఇలాంటి ఇన్సూరెన్స్ ఉంటుందని



మాకు తెలియదు వాళ్ళు ఈ మీటింగ్ పెట్టడం ద్వార తెలిసింది. మా భర్త పాస్‌బుక్ చూపిస్తే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కందుకూరు బ్రాంచ్ లో స్టేట్‌మెంట్ తీసి చూస్తే నా భర్త ఖాతా నుండి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఇన్సూరెన్సు వుంది అని బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావు చెప్పారు. అప్పుడు వారు ఇన్సూరెన్స్ కి అప్లై చేసారు. నా భర్తకు నామిని అయిన నాకు ఇన్సూరెన్స్ డబ్బులు 2,00,000/-ల రూపాయలు నా బ్యాంకుఖాతాకు జమ చెసారు. నాకు ఈ డబ్బులతో నేను వ్యవసాయం చేసుకుంటూ నా పిల్లలు ను చదివించుకోవడం కొరకు నా కుటుంబ అభివృద్ధి కి ఉపయోగించుకుంటాను. మాకు ఇంత పెద్ద సహాయం అందించిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు బ్యాంకు మేనేజర్ నాగేశ్వరరావు కి ఎస్.ఎస్.టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు కి ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఓబులాపురంలో రైతన్న మీకోసం కరపత్రాలు పంపిణీ


**కొమరోలు పెన్ పవర్ మార్చి 25**

కొమరోలు మండలం చింతలపల్లి పంచాయతీలోని ఓబులాపురం గ్రామంలో బుధవారం మలికేపల్లె గ్రామానికి చెందిన చింతలపల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు సారే ఎల్లాల నాయుడు ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలలో డబ్బును జమ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, అభివృద్ధి చేస్తున్న కృషిని వివరిస్తూ రైతన్న మీకోసం కరపత్రాలను ముద్రించి నియోజకవర్గాలకు సరఫరా చేసింది. దీనితో గత వారం రోజులుగా గిద్దలూరు నియోజకవర్గంలోని మండలాలలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నేతలు, కార్యకర్తలు రైతన్న మీకోసం కరపత్రాలను గ్రామాలలో పంపిణీ చేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం కొమరోలు మండలం చింతలపల్లి పంచాయితీలోని ఓబులాపురం గ్రామంలో చింతలపల్లి పంచాయితీ తెలుగుదేశం పార్టీ నాయకులు సారే ఎల్లాలు నాయుడు ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కరపత్రాల పంపిణీ కార్యక్రమం



ముమ్మరంగా సాగింది. ఆ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలతో పాటు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి రైతుల అభ్యున్నతికి నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని ఎల్లాలు నాయుడు రైతులకు వివరించారు. ఆ కార్యక్రమంలో చింతల పల్లె పంచాయతీలోని ఓబులాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జయరావు సేవలు చిరస్మరణీయం






**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 25**

పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆర్ఎంపి వైద్యుడు, కామ్రేడ్ డాక్టర్ దమ్ము జయరావు అందించిన సేవలు చిరస్మరణీయమని సిఎస్పురం ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య అన్నారు. స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ డాక్టర్ దమ్ము జయరావు ఐదవ వర్ధంతి సభ ఊసా రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా జయరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఎటువంటి వైద్య సౌకర్యాలు లేని రోజులలో వెనుకబడిన ప్రాంతమైన సిఎస్పురం వచ్చిన డాక్టర్ దమ్ము జయరావు ఆర్.ఎం.పి వైద్యం గా మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం వైద్య చికిత్సలు అందించారని, కష్టాలలో ఉన్న పేదవారికి సైతం తాను ఉన్నానంటూ అండగా నిలిచారని కొనియాడారు. ఊసా రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, ఎస్ తిరుపతి రెడ్డి, బత్తుల జ్ఞానరాజు, బక్క జేసురత్నం, ఎస్ శ్రీనివాసులు రెడ్డి, ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జె ఎస్ ఆనంద్ బాబు, టిడిపి నాయకుడు దాసరి మల్లికార్జున, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా పరిష్కరించాలి

## -ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య







**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 25** వేసవిలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా పరిష్కరించాలని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. గతంలో పనిచేసిన, చేయవలసిన పనులు అభివృద్ధిపై చర్చించారు అయితే గత సర్వసభ్య సమావేశంలో ప్రజలు సూచించిన సమస్యలు ఇంకా పరిష్కారం కానందున పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొని వచ్చారు రేగులచెలక పంచాయతీలో బోర్లు పనిచేయకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ వివరించారు. బోర్ రిపేరుకు కావలసిన మెటీరియల్ ఇంకా మండల పరిషత్ కార్యాలయానికి రాలేదని, వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసరంగా ఈ సామాగ్రిని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని సభ దృష్టికి తీసుకువచ్చారు ఈ సందర్భంగా ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండల గ్రాంట్ నిధుల ద్వారా బోరింగ్ మెటీరియల్ తెప్పించి, నీటి సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు వెలిగండ్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ కృపావరం మాట్లాడుతూ దర్శితిమ్మక్కపల్లి అంగన్వాడీ కేంద్రంలో విద్యుత్ మీటర్ లేకపోవడంతో కరెంటు సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ రమేష్ స్పందిస్తూ మీటర్ కోసం అప్లికేషన్ పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవాలని, కరెంటు మీటర్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు ఈ సందర్భంగా ఎంపిపి వెంకటేశ్వర్లు స్పందిస్తూ మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో కరెంటు మీటర్లు లేని కేంద్రాలను గుర్తించి వెంటనే దరఖాస్తులు పంపించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ కృపావరం కు సూచించారు మండలంలో పంచాయతీల విద్యుత్ బకాయిలను చెల్లించాలని విద్యుత్ ఏఈ రమేష్ సభా దృష్టికి తెలియపరిచారు హౌసింగ్ ఏఈ శివ రెడ్డి మాట్లాడుతూ మండలంలో 1631 గృహాలు మంజూరైనట్లు వివరించారు సభలో పలువురు సభ్యులు మండల వ్యాప్తంగా పలు పంచాయతీలో త్రాగునీటి సమస్యలు ఉన్నాయని పరిష్కరించాలని తెలియపరిచారు ఈ సందర్భంగా ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని 23 పంచాయతీల్లో నీటి ఎద్దడి లేకుండా పైపులైన్లు మోటారు రిపేర్లు వివిధ సమస్యలను పర్యవేక్షించి ప్రజలకు నీటి సమస్యలు రాకుండా పరిష్కరించాలని అధికారులకు సభ్యులకు సూచించారు ప్రతి గ్రామపంచాయతీలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, 100 శాతం ఇంటి పన్ను వసూలులో అధికారులకు సహకరించాలని సభ్యులకు సూచించారు ఈ సమావేశమునకు ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### మండు వేసవిలోనూ అరగడపల్లిలో హిమ సోయగాలు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 25:** అల్లూర జిల్లాలోని ప్రకృతి అందాలు మరోసారి ఆకట్టుకుంటున్నాయి.మండు వేసవిలోనూ ఇక్కడ మంచు మేఘాలు అలరిస్తుండటం విశేషం. జీకే వీధి మండలం వంచుల పంచాయతీ అరగడపల్లి గ్రామంలో బుధవారం ఉదయం సూర్యోదయం అయినా, 10 గంటల దాటినా మంచు తొలగకపోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. పచ్చని కొండల మధ్య శ్వేత వర్ణంలో మెరిసే మంచు మేఘాలు పాలకడలిని తలపిస్తున్నాయి. కాలాలతో సంబంధం లేకుండా ప్రకృతి సోయగాలు ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

### పది తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన తహసిల్దార్




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 25** ,జీకేవీధి మండలంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ఏ', 'బి' పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు.పరీక్ష నిర్వహణ తీరును సమీక్షించిన తహసీల్దార్, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయా లేదా అన్న విషయాన్ని ప్రత్యేకంగా గమనించారు. ఈ సందర్భంగా మాస్ కాపీయింగ్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సంబంధిత ఇన్విజిలేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆదేశించారు.

### జీకే వీధిలో శ్రీరామ నవమి ఉత్సవాల సందడి ప్రారంభం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 25:** మండలంలోని జీకే వీధిలో శ్రీ రామ నవమి ఉత్సవాల సందడి ప్రారంభమైంది. ఈ నెల 27 జరిగే వేడుకలకు ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. అదే రోజు సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.ఇందుకోసం బుధవారం ఉత్సవ పందిరి రాట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మహిళలు, గిరిజనులు పూజలు చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. 27న ఉత్సవమూర్తుల ఊరేగింపు, కళ్యాణం వైభవంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గొర్లె వీర వెంకట్, బీజేపీ నాయకులు రిమెల పాల్, ఎంపీటీసీ రాజేశ్వరి,టీడీపీ నాయకులు ముక్కలి రమేష్, గ్రామ పెద్దలు వెంకట రావు, సురకత్తి లక్ష్మణ్ బాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### చింతపల్లి నియోజకవర్గ పునరుద్ధరణపై ఆశలు



(స్టాఫ్ రిపోర్టర్ మాదిరి చంటిబాబు)**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, మార్చి 25:**గతంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందిన చింతపల్లి శాసనసభ నియోజకవర్గం మళ్లీ పునరుద్ధరించాలన్న ఆశలు స్థానిక ప్రజల్లో మళ్లీ చిగురిస్తున్నాయి. అప్పట్లో చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాలతో పాటు నాతవరం, గొలుగొండలలోని గిరిజన గ్రామాలు ఈ నియోజకవర్గ పరిధిలో ఉండేవి.కాలక్రమేణా జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో చింతపల్లి నియోజకవర్గం రద్దై, ప్రస్తుతం పాడేరు నియోజకవర్గంలో విలీనమైంది. దీంతో గిరిజన ప్రాంతాల ప్రత్యేక అవసరాలు, సమస్యలు తగిన స్థాయిలో వినిపించడం లేదన్న అభిప్రాయం స్థానికుల్లో ఉంది.చింతపల్లి శాసనసభ నియోజకవర్గం 1978లో ఏర్పడి, 2008లో రద్దయింది. ఇది విశాఖపట్నం జిల్లాలో గిరిజన ప్రాంతాలను కవర్ చేసేది.ఇప్పుడు మళ్లీ శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనపై చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో, చింతపల్లి నియోజకవర్గం తిరిగి ఏర్పాటు కావాలన్న డిమాండ్ బలపడుతోంది. గిరిజన గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యలకు ప్రత్యేక ప్రాతినిధ్యం అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. చింతపల్లి నియోజకవర్గం పునరుద్ధరణ జరిగితే, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆన్-లైన్ బెట్టింగు యాపులతో మరియు ఆఫ్-లైన్ బెట్టింగుతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

✷ జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్.




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 25 :** ఆన్-లైన్ బెట్టింగు యాపులతో మరియు ఆఫ్-లైన్ బెట్టింగుతో జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. ఈ నెల 28 నుండి ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆన్-లైన్, ఆఫ్-లైన్ క్రికెట్ బెట్టింగులకు పాల్పడేవారు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని, ఆర్థికంగా జీవితాలను నాశనం చేసే బెట్టింగుల జోలికి పోవద్దని ప్రజలు, యువతను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు.

బెట్టింగు యాపుల వినియోగం వలన ఆర్థికంగా ఎక్కువగా నష్టం కలిగిస్తాయని, సాఫీగా సాగిపోతున్న జీవితాలను నాశనం చేస్తాయాని ఎస్పీ ఎఆర్ దామోదర్ అన్నారు. చిన్న మొత్తాలతో ప్రారంభించిన బెట్టింగులు, ఆశక్తి పెరిగే కొద్ది పెద్ద మొత్తంలో డబ్బులను బెట్టింగుకు పెట్టి, చివరకు ఆర్థికంగా పెద్ద మొత్తంలో నష్టపోతారన్నారు. బెట్టింగుల్లో ఎదురైన ఓటముల వలన నష్టాన్ని అధిగమించేందుకు మరింత ఎక్కువ పెట్టుబడులు పెట్టడం మరియు మరిన్ని అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. బెట్టింగు యాపులను ప్రారంభంలో సరదాగా వినియోగించి, చివరకు అదే వ్యసనంగా మారే పరిస్థితులకు చేరుకొంటారన్నారు. ఒకసారి బెట్టింగులకు అలవాటు పడిన వ్యక్తులు తమ ఆలోచనలన్నీ బెట్టింగు మీదనే పెట్టి, ఆర్థిక నష్టాలతో చివరకు కుటుంబ సభ్యులతో గొడవలకు దారితీస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. బెట్టింగులకు అలవాటుపడిన వ్యక్తులు కుటుంబ అవసరాలను నిర్లక్ష్యం చేస్తూ, సంపాదనంతా బెట్టింగుల్లోనే పోగొట్టుకొనే ప్రమాదం కూడా ఉందన్నారు. బెట్టింగులతో డబ్బులను పోగొట్టుకొని మానసిక ఒత్తిడికి గురవుతారని, నిరాశ, ఆత్మన్యూనత భావాలతో చివరికి ఆత్మహత్యా ప్రయత్నాలకు దారితీస్తాయన్నారు. బెట్టింగులతో నిత్యం సమయాన్ని గడపడం వలన కుటుంబ సభ్యులు, స్నేహితులకు దూరం కావడమే కాకుండా, విలువైన సమయాన్ని వృధా చేస్తూ, అభివృద్ధికి దూరమవుతారని ప్రజలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు.

ఈ తరహా బెట్టింగు యాపులను వినియోగించడం, ఆఫ్-లైన్ బెట్టింగులకు పాల్పడడం చట్ట విరుద్ధమని, ఎవరైనా బెట్టింగులకు పాల్పడి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ తరహా కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు, పెద్ద మొత్తంలో జరిమానాలు తప్పవన్నారు. కావున, ప్రజలు, ముఖ్యంగా యువత తమ జీవితాలను నాశనం చేసే బెట్టింగు యాపుల జోలికి పోవద్దన్నారు. బెట్టింగులతో డబ్బులు సంపాదించవచ్చు అనే అత్యాశతో బెట్టింగులకు పాల్పడే కంటే ఆర్థిక భద్రత కోసం కష్టపడి పని చేయడం, న్యాయబద్ధంగా సంపాదించిన నగదును సద్వినియోగం చేసుకోవడం ఉత్తమమైన మార్గమని ప్రజలకు జిల్లా ఎస్పీ సూచించారు. ఆన్-లైన్ లేదా ఆఫ్-లైన్ బెట్టింగులకు పాల్పడేవారి సమాచారాన్ని డయల్ 112/100 లేదా స్థానిక పోలీస్ స్టేషనుకు సమాచారం అందించాలని ప్రజలను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.

# బీచ్‌లో డ్రగ్స్ వ్యతిరేకంగా 5కె రన్ పోస్టర్ ఆవిష్కరణ




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 25 :**ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదకద్ర వ్యాల నిర్మూలనకు అవగాహన కల్పించేందుకు బీచ్‌లో నిర్వహించనున్న 5కె రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విడు దల చేశారు. మార్చి 29న జరగనున్న ఈ 5కె రన్‌లో తాను ముఖ్య అతిథిగా పాల్గొంటానని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ, డివైఎ ఫ్ఐ నాయకులు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న డ్రగ్స్, గంజాయి వినియోగం సమా జానికి తీవ్ర ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశా రు. జిల్లాలో గంజాయి మాఫియాను అరికట్టేం దుకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువతను లక్ష్యంగా చేసుకు ని మాదకద్రవ్యాల రవాణా పెరుగుతుందని, వాటి వల్ల జీవితాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి అలవాట్లు వ్యక్తి గత ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయని, ఆర్థిక సమస్యలు మరియు అనారోగ్యానికి దారితీ స్తాయని హెచ్చరించారు.యువతకు సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారమని అభిప్రా యపడ్డారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఈ సమస్యను అందరి సహకారంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అజయ్, నాయకులు కుసుమాంజలి, నాయు డు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, కార్య దర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యాపారాభివృద్ధితో సంపన్నకారి కావాలి..



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 25 ..** వ్యాపార అభివృద్ధితో ప్రతి మహిళా సంపన్న కారి కావాలని మండల సమాఖ్య ఏపిఎం ఎన్ అప్పలనాయుడు అన్నారు. బుధవారం నాడుచీపురుపల్లి మండల సమాఖ్య కార్యాలయం లో "సంపన్నకారి" కార్యక్రమం పైన శిక్షణ కార్యక్రమం వి ఏ ఓల కు, సి ఆర్ పి లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపిఎం ఎన్ అప్పలనాయుడు మాట్లాడుతూ ఇప్పటికే స్వయం సహాయక సంఘ మహిళలు నిర్వహిస్తున్న వ్యాపార కార్యక్రమాలు ను, మరింతగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాపార అభివృద్ధిని చేయడానికి సంబంధించి పలు సూచనలు చేశారు. సరిఅయిన మార్గదర్శనం, ఆర్థిక సహాయం, వ్యాపార శిక్షణలు మరియు మరిన్ని అవకాశాలు కల్పించడం కోసం రూపొందించబడిందే అన్నారు.. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళా వ్యాపారాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రముఖ విద్యాసంస్థ ఐఐఎం విశాఖపట్నం కలిసి పనిచేస్తాయి అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం లో ఎం ఎం ఎస్ అధ్యక్షులు కే. దమయంతి, సీసీలు, వివో ఏ లు, సిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

### మాతృ-శిశు మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు



**గూడెం కొత్త,పెన్ పవర్,మార్చి 25:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెం కొత్త మండల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్.జె.పాలెం, యు.చీడిపాలెం, ఆర్.వి.నగర, జి.కె.వీధి, సప్పర్ల, దారకొండ, సీలేరు ప్రాంతాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది హాజరయ్యారు.ఈ సందర్భంగా మాతృ మరియు శిశు సంరక్షణ కార్యక్రమంపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధి నివారణ టీకాల ప్రాముఖ్యతపై వివరించారు. అలాగే 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల ఆడపిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను శాతం 100 పూర్తిచేయాలని సూచించారు. రిప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్ (ఆర్‌సీహెచ్) పోర్టల్ నిర్వహణపై కూడా సిబ్బందికి మార్గదర్శకాలు ఇచ్చారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్ఆర్) సంబంధిత లాగిన్‌లు పూర్తిగా నమోదు చేయాలని అధికారులుఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పసుపులేటి నారాయణరావు, ఈహెచ్ఆర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పూజారి హరిప్రియ, జి.కె.వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎం. రుషశ్రీ, ఎస్.ఓ. జయంతి కైలాసరావు, డీపీఎచ్ఎన్ఓ జి. భూలోకమ్మ, డీపీఓ ఎస్. సతీష్, ఎంపీహెచ్(ఈ)ఓలు కె. వెంకటేశ్, ఎం. జాన్సన్, సీలేరు హెల్త్ సూపర్వైజర్ ఎన్. త్రినాధ్, దారకొండ పిహెచ్ఎన్ బత్తుల విక్టోరియా మహారాణి, హెల్త్ సూపర్వైజర్ ఎల్. రాజులమ్మ పాల్గొన్నారు.మండలంలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎంఎల్హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఈ సమావేశంలో పాల్గొని సూచనలు స్వీకరించారు.

# ఏపీలో మహిళా నియోజవర్గాలు..ఇవే

**తిరుపతి,మార్చి 25, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా నియోజకవర్గాలు పెరగనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్డీఏ సమావేశంలో స్పష్టమైన సంకేతాలు అందాయి దీనిపై. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే పునర్విభజన బిల్లు పార్లమెంట్లో ఆమోదించనున్నారు. అదే జరిగితే దేశవ్యాప్తంగా పార్లమెంట్ సీట్లతో పాటు అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే ఇప్పటికే మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తూ 2023లో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందింది. అయితే ఇప్పుడు పునర్విభజన బిల్లుతో పాటు మహిళా బిల్లును కూడా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం సంచలనంగా మారింది. పునర్ విభజనకు సంబంధించి ఏపీలో 50% చొప్పున అసెంబ్లీ, లోక్సభ సీట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంటు సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనతో అసెంబ్లీ స్థానాలు 263, లోక్సభ సీట్లు 38 కి చేరుకుంటాయి. మహిళా ప్రాతినిధ్యం కూడా పెరగనుంది. వారికి 87 అసెంబ్లీ, 13 పార్లమెంట్ సీట్లు దక్కనున్నాయి. అయితే ఫలానా నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ చేస్తారని చెప్పడం కష్టం కానీ.. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండే నియోజకవర్గాలను మాత్రం మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో 58 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికం. వాటిని మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.రాష్ట్రంలో ప్రధానంగా భీమిలి నియోజకవర్గం లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అక్కడ ఏకంగా 1,65,570 మంది మహిళలు ఉండడం విశేషం. పాణ్యం, గాజువాక, చంద్రగిరి, తిరుపతి, మంగళగిరి, పెనమలూరు, రంపచోడవరం, పెందుర్తి, గురజాల, విశాఖపట్నం నార్త్,కోవూరు, కర్నూలు, విజయవాడ ఈస్ట్,విజయవాడ సెంట్రల్, గుంటూరు వెస్ట్,గన్నవరం, మైలవరం, నెల్లూరు రూరల్, తెనాలి, నంద్యాల, అనంతపురం అర్బన్, ఇచ్చాపురం, కడప, శ్రీకాకుళం, చింతలపూడి, రాజమహేంద్రవరం సిటీ,ప్రత్తిపాడు, రాజమహేంద్రవరం రూరల్, గుంతకల్లు, కాకినాడ సిటీ, పలమనేరు, విశాఖపట్నం ఈస్ట్, మాచర్ల,వినుకొండ, కాకినాడ రూరల్, భీమవరం, రాయదుర్గం, మదనపల్లి,పోలవరం, కావలి,జమ్మలమడుగు,కొత్తపేట, పాయకరావుపేట, శ్రీకాళహస్తి, ప్రొద్దుటూరు,ఆదోని, విజయనగరం, రాయచోటి, కదిరి, రాప్తాడు,ఆలూరు, గుంటూరు ఈస్ట్, విజయవాడ వెస్ట్, గూడూరు, ఒంగోలు, బనగానపల్లె,తాడిపత్రి నియోజకవర్గాల్లో మహిళలు అధికం.పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి విశాఖపట్నంలో అత్యధికంగా 9,20,376 మంది మహిళలు ఉన్నారు. ఆ తరువాత స్థానాల్లో గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, నంద్యాల,విజయవాడ, కర్నూలు,కాకినాడ, ఏలూరు, కడప, చిత్తూరు, రాజంపేట, శ్రీకాకుళం, అనకాపల్లి, హిందూపురం, రాజమండ్రి,ఒంగోలు, అరకు, విజయనగరం, మచిలీపట్నం, బాపట్ల, అమలాపురం, నరసాపురం పార్లమెంట్ స్థానాల్లో మహిళలు ఎక్కువ. మరి ఈ నియోజకవర్గాల్లో మహిళలకు ఛాన్స్ దక్కుతుందా? లేదా? అన్నది చూడాలి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఢిల్లీలోనూ నెంబర్ 11 తంటా

**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** ఢిల్లీలోని నూతన పార్లమెంటు భవనంలో గదుల కేటాయింపు విషయం.. ఏపీలో ఇప్పుడు ఆసక్తికర చర్చకు కారణమైంది. గదుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా స్పీకర్ కార్యాలయం.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11వ నంబర్ గది కేటాయించింది. పార్టీల బలాబలాల ఆధారంగా స్పీకర్ కార్యాలయం గదులను కేటాయిస్తోంది. ఈ క్రమంలోనే వైసీపీ ఎంపీల కోసం నూతన పార్లమెంట్ భవనం ఫస్ట్ ఫ్లోర్లోని 11వ నంబర్ గదిని కేటాయించారు. అయితే వైసీపీ ఎంపీలు.. తమ గదిని మార్చాలని స్పీకర్ను కోరినట్లు తెలిసింది. స్పీకర్ ఓంబిర్లాతో భేటీ అయిన వైసీపీ ఎంపీలు.. తమకు 11వ నెంబర్ గద వద్దని కోరినట్లు తెలిసింది. అందుకు బదులుగా మరో గదిని కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. దీంతో వైసీపీ ఎంపీల విజ్ఞప్తిని సానుకూలంగా తీసుకున్న స్పీకర్.. వైసీపీ ఎంపీల కోసం 12వ నంబర్ రూమ్ కేటాయిస్తూ మార్పులు చేశారు.మరోవైపు నూతన పార్లమెంట్ భవనంలో టీడీపీకి 9వ నంబర్ గది కేటాయించారు. మొదటి అంతస్తులోని 9వ నంబర్ గదిని టీడీపీ ఎంపీల కోసం కేటాయించారు. కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి రావటంతో.. పాత పార్లమెంట్ భవనంలో ఉన్న పార్టీ ఆఫీసులనుఖాళీ చేయిస్తున్నారు. నూతన పార్లమెంట్ భవనంలో పార్టీలకు గదులు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలోనే వైసీపీకి 12, టీడీపీకి 9వ నంబర్ గదులు కేటాయించామరోవైపు 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితమైంది. 2019 ఎన్నికల్లో 151 సీట్లలో విజయం సాధించిన వైసీపీ.. 2024లో మాత్రం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహా మంత్రివర్గంలోని నేతలందరూ ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ సామర్థ్యంలో పది శాతం సీట్లు సాధించకపోవటంతో వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీకి ఏపీ ప్రభుత్వం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు.ఇదే సమయంలో వైసీపీ 11 సీట్లను పరోక్షంగా ఉద్దేశిస్తూ కూటమి పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తుంటారు. ఈ క్రమంలోనే నూతన పార్లమెంట్ భవనంలో వైసీపీకి 11 నంబర్ గది కేటాయించడం.. ఆ తర్వాత వైసీపీ ఎంపీల అభ్యర్థనతో దానిని 12వ నంబర్ గదికి మార్చటం చర్చనీయాంశమవుతోంది.

## బెజవాడలో ఏం జరుగుతోంది....

**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** ఉగ్రవాదులతో సంబంధం ఉందని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు విజయవాడ సీసీఎం కోర్టు రిమాండ్ విధించింది. ఏప్రిల్ 6వ తేదీ వరకూ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఉన్నాయంటూ ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో ప్రత్యేక గ్రూప్ ఏర్పాటు చేసి ఉగ్రవాద భావజాలాన్ని యువతలో ప్రోత్సహించేందుకు వీరు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. విజయవాడలో ఉగ్రవాద సానుభూతిపరుల కదలికల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకొని.. సోషల్ మీడియా ద్వారా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను విజయవాడ టూటౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ డానిష్, మీర్జా సొహైల్ మహమ్మద్ రహంతుల్లా షరీఫ్ అనే ముగ్గురు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ యువకులు టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్ల నుంచి నిధులు సమకూరుతున్నట్లు నిఘావర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు ముగ్గురు నిందితులను విజయవాడ పోలీసులను విజయవాడ సీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఏప్రిల్ ఆరో తేదీ వరకూ కోర్టు రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు వీరిని విజయవాడ సెంట్రల్ జైలుకు తరలించారు. మరోవైపు విచారణ సందర్భంగా లాయర్ను నియమించుకున్నారా? అని న్యాయమూర్తి నిందితులను ప్రశ్నించారు. అయితే తాము నియమించుకోలేమని నిందితులు కోర్టుకు తెలిపారు. దీంతో ఈ విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేయాలని కోర్టు ఆదేశించింది.మరోవైపు ఈ కేసులో యాంటీ టెర్రరిస్ట్ దళాలు జరిపిన విచారణలో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముగ్గురు యువకులు ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో గ్రూపును ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఏడు రాష్ట్రాలలో 42 మంది సభ్యులతో ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ గ్రూపు ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్లు గుర్తించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటుగా ఢిల్లీ, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా గ్రూపులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీంతో ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ముఖానికి మాస్కులతో ఫోటోలు, సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు, ఆడియోలు పెడుతున్నట్లు గుర్తించారు. పాకిస్థాన్ , అఫ్ఘానిస్తాన్లో ఉగ్రవాద శిక్షణకు వెళ్లేలా యువతను ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు

## అనంతలో ఓపెన్ కూలింగ్ సిస్టమ్

**అనంతపురం, మార్చి 25, పెన్ పవర్:** సవి కాలంలో వాహనదారులకు ఉపశమనం కలిగించేలా అనంతపురంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. సురేష్ నాయక్ అనే ఉపాధ్యాయుడు ఆలోచనతో దీనిని రూపొందించారు. ప్రయోగాత్మకంగా సప్తగిరి సర్కిల్ వద్ద ఏర్పాటు చేశారు. దీని ద్వారా వాహనదారులపై తుంపర్లుగా నీటిని చల్లుతారు. దీంతో ఎండవేడిమి నుంచి వారికి ఉపశమనం కలుగుతుందని అధికారులు చెప్తున్నారు.వేసవి కాలం వచ్చేసింది. ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం పది గంటలకే భానుడు భగభగమండిపోతున్నాడు. మార్చి నెల మధ్యలోనే ఈ పరిస్థితి ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో భానుడి ఉగ్రరూపం మరోస్థాయికి చేరనుంది. ఈ నేపథ్యంలో ప్రజలు భయపడిపోతున్నారు. ఇక ఎండాకాలంలో రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి. ఓ వైపు సుర్రుమనిపించే సూరీడు.. మరోవైపు వేడిగాలులు.. దీంతో ఉక్కబోతను భరించలేక ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఇక వాహనదారుల పరిస్థితి అయితే చెప్పక్కర్లేదు. పైన ఎండ, కింద బండి వేడితో ఇబ్బందుల పడుతుంటారు. ఈ నేపథ్యంలోనే అనంతపురం జిల్లాలో ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.రాజేంద్రనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్గా పనిచేస్తున్న సురేష్ నాయక్ బుర్రలో మెదిలిన ఆలోచన ఇది. వేసవి తాపం నుంచి వాహనదారులకు ఉపశమనం కల్గించేందుకు సురేష్ నాయక్..ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఆలోచన చేశారు. ఇంజనీరింగ్ అధికారుల సహాయంతో అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ వద్ద ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. ఎండలకు వాహనదారులు ఇబ్బందులు పడకుండా సప్తగిరి సర్కిల్ వద్ద దీనిని ఏర్పాటు చేశారు.ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ అంటే.. ఒక డ్రమ్ములో నీళ్లను నింపుతారు. ఈ నీటిని మోటార్ల సాయంతో పైపుల ద్వారా తుంపర్లుగా.. రోడ్డుపైనే వెళ్లే వాహనదారులపై వదులుతారు. ట్రాఫిక్ సిగ్నల్ పడిన సమయంలో కూడలి వద్ద ఉన్న వాహనదారులపై తుంపర్లు, తుంపర్లుగా నీరు పడటంతో.. వాతావరణం చల్లబడటంతో పాటుగా.. వారికి కాస్త ఉపశమనంగా ఉంటుందని అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టం ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని అధికారులు చెప్తున్నారు. మొత్తంగా ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న ఈ ఓపెన్ స్పేస్ కూలింగ్ సిస్టమ్ కారణంగా అనంతపురంలోని వాహనదారులు కాస్త రిలీఫ్ పొందుతున్నారు.

# జనసేనలో వారసుల తంటా

**కాకినాడ, మార్చి 25, పెన్ పవర్:** జనసేన పార్టీ ప్రారంభం నుంచే కొన్ని స్పష్టమైన సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించకూడదనే ఆలోచన పార్టీకి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. 2019 ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఆ సమయంలో పార్టీకి పెద్దగా ప్రభావం కనిపించలేదు. అయితే 2024 ఎన్నికల నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పార్టీకి ప్రజల్లో డిమాండ్ పెరిగింది, నాయకులు కూడా ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఈ మార్పు వల్లే జనసేన రాజకీయంగా బలపడినట్టు కనిపిస్తోంది.దీంతో జగ్గంపేట వంటి నియోజకవర్గాల్లో టికెట్ల కోసం పోటీ తీవ్రంగా జరిగింది. పార్టీ బలపడటంతో నాయకులు కూడా తమ స్థానం కోసం ప్రయత్నాలు పెంచారు. అయితే ఇప్పుడు మరో ఆసక్తికరమైన పరిణామం కనిపిస్తోంది. కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. బహిరంగంగా పెద్దగా మాట్లాడకపోయినా, నియోజకవర్గ స్థాయిలో తమ వారిని ప్రోత్సహిస్తూ మౌనంగా వ్యూహాలు అమలు చేస్తున్నారు.ప్రస్తుతం ఉన్న 21 మంది ఎమ్మెల్యేలలో కొందరు తమ వారసులను రంగంలోకి దించాలనే ఆలోచనలో ఉన్నారు. మరోవైపు కొంతమంది సీనియర్ నాయకులు కూడా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని




తమ కుటుంబ సభ్యులకు అవకాశాలు కల్పించాలని చూస్తున్నారు. అయితే ఈ పరిస్థితి జనసేన పార్టీ అసలు సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటివరకు ప్రజల్లో పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. వారసత్వం కంటే ప్రజాదరణ ఉన్నవారిని ఎంపిక చేయడమే ఆయన విధానంగా కనిపిస్తోంది. గతంలో కూడా ఆయన ఇదే విధంగా టికెట్లు ఇచ్చారు. కాకినాడ రూరల్ నుంచి నానాజీ , రైల్వే కోడూరు నుంచి అరవ శ్రీధర్ వంటి వారికి అవకాశం కల్పించారు. వీరంతా తమ పనితీరు ద్వారా గుర్తింపు పొందిన వారే.ఇప్పుడూ అదే విధానాన్ని కొనసాగించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పటికే కొంతమంది ఎమ్మెల్యేలు తమ కుటుంబ సభ్యులను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. ఈ పరిస్థితిలో పార్టీ తీసుకునే నిర్ణయం కీలకం అవుతుంది. మొత్తంగా చూస్తే, జనసేన పార్టీ సిద్ధాంతాలు ఒకవైపు, నాయకుల వ్యక్తిగత ఆశయాలు మరోవైపు ఉన్న పరిస్థితి ఏర్పడింది. పవన్ కళ్యాణ్ ఈ రెండింటి మధ్య ఎలా సమతుల్యం పాటిస్తారు, వారసత్వ రాజకీయాలపై ఎంతవరకు రాజీ పడతారు అనేది వచ్చే రోజుల్లో స్పష్టత వచ్చే అంశంగా మారింది.

# జగన్ ఇమేజ్ డ్యామేజ్



**విజయవాడ, మార్చి 25, పెన్ పవర్:** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబంలో చెలరేగిన ఆస్తుల వివాదం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలతో జగన్ సాగిస్తున్న ఈ న్యాయపోరాటం కేవలం ఒక కుటుంబ సమస్యగా కాకుండా, రాజకీయంగా పెను ప్రభావం చూపే అంశంగా మారింది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఆస్తుల పంపిణీ విషయంలో జగన్, షర్మిల మధ్య విభేదాలు పొడసూపాయి. గతంలో కుదుర్చుకున్న ఒక అవగాహన ఒప్పందం ప్రకారం కొన్ని ఆస్తులను చెల్లికి బదలాయించాల్సి ఉండగా, జగన్ ఆ ప్రక్రియను నిలిపివేయడం వివాదానికి కేంద్రబిందువు అయింది. ఈ క్రమంలో జగన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించడం, షర్మిలకు ఇచ్చిన షేర్లను తిరిగి తీసుకోవాలని కోరడం సంచలనం సృష్టించింది. దీనికి ప్రతిగా తల్లి విజయమ్మ, షర్మిల తరపున నిలబడి అఫిడవిట్ దాఖలు చేయడం జగన్కు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది.జగన్ రాజకీయ జీవితం మొత్తం “మాట తప్పను.. మడమ తిప్పను” అనే నినాదం చుట్టూ తిరుగుతుంది. అయితే, తండ్రి బతికి ఉన్నప్పుడు చెప్పిన అంశాలను, కుటుంబ ఒప్పందాలను ధిక్కరించడం వల్ల ఆయన ‘విశ్వసనీయత’ ప్రశ్నార్థకమైంది. సొంత తల్లిని, చెల్లిని కోర్టుకు లాగడం అనేది తెలుగు సమాజంలో నైతికంగా ఆమోదయోగ్యం కాని విషయం. సామాన్యులెవరూ దీన్ని అంగీకరించరు. చెల్లి విషయంలో అయినా కాస్త ఆలోచిస్తారేమో కానీ, తల్లిని కూడా జగన్ ఇబ్బంది పెడుతున్నారనే అంశమే ప్రజల్లోకి బాగా వెళ్తోంది. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్ను గణనీయంగా దెబ్బతీస్తోంది.ఈ వివాదం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూర్చేలా ఉంది. జగన్ తన పాలనలో ‘అక్కా.. చెల్లెమ్మ’ అంటూ మహిళలకు ప్రాధాన్యతనిచ్చారు. కానీ సొంత చెల్లికి ఆస్తి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారం మహిళా ఓటర్లలో ప్రతికూల భావనను కలిగించే అవకాశం ఉంది. టీడీపీ, జనసేన వంటి పార్టీలు ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నాయి. “సొంత తల్లికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు?” అనే ప్రశ్నను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న వైసీపీ కార్యకర్తలు ఈ వివాదంపై ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం విడిపోవడం వల్ల పార్టీ పట్ల ఉన్న సెంటిమెంట్ పలచబడే ప్రమాదం ఉంది.జగన్ తన ఆస్తులు ఈడీ అటాచ్మెంట్లో ఉన్నాయని, అందుకే బదలాయింపు సాధ్యం కాదని వాదిస్తున్నారు. కానీ, కుటుంబ సభ్యులు దీనిని కేవలం జగన్ ‘మొండితనం’గా భావిస్తున్నారు. ఆస్తుల విలువ కంటే, తన మాటే చెల్లాలనే ఆయన ‘ఈగో’ వల్లనే ఈ సమస్య ఇంతవరకు వచ్చిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజకీయ చాణక్యత ప్రదర్శించాల్సిన చోట, జగన్ తన కుటుంబంపై కఠినంగా వ్యవహరించడం వ్యూహాత్మక తప్పిదమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.జగన్ ఈ సమస్యను త్వరగా పరిష్కరించుకోకపోతే, భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఆస్తుల వల్ల ఆర్థిక బలం పెరగవచ్చు కానీ, రాజకీయాల్లో అత్యంత విలువైన ప్రజాభిమానం, విశ్వసనీయతను ఆయన కోల్పోయే ప్రమాదం ఉంది. తల్లి విజయమ్మ ప్రత్యక్షంగా షర్మిల వెనుక నిలబడటం జగన్ రాజకీయ ప్రయాణంలో అతిపెద్ద సవాలుగా మిగిలిపోనుంది.

## వన్డే ప్రపంచకప్ జట్టులో టీ20 వరల్డ్ కప్ హీరోలకి నో ఛాన్స్.. ఏకంగా 8 మంది ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా, జింబాబ్వే మరియు నమీబియా సంయుక్త వేదికలలో జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. 2026 టీ20 వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి ట్రోఫీ గెలిచిన జోరులో ఉన్న టీమిండియా, వన్డే జట్టులో సమూల మార్పులు చేసేందుకు రెడీ అయింది. వన్డే క్రికెట్ లో ఓపికతో పాటు ఇన్నింగ్స్‌ను నిర్మించే వారిపై బీసీసీఐ మొగ్గు చూపుతోంది.

టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా ఆడిన సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్ లాంటి ప్లేయర్స్ కి 2027 వన్డే జట్టులో చోటు దక్కే అవకాశం కనిపించడం లేదు. వీరందరూ కేవలం టీ20 స్పెషలిస్టులుగానే ముద్రపడటం, వన్డే ఫార్మాట్‌కు అవసరమైన నిలకడ వీరిలో లేకపోవడంతో ఈ 8 మంది ఆటగాళ్ల ఎంపికపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. కానీ, రాబోయే దేశవాళీ, ద్వైపాక్షిక సిరీస్‌లలో వీళ్లందరూ అద్భుతంగా రాణిస్తే తప్ప వన్డే జట్టులోకి పునరాగమనం చేయడం కష్టమే.

భవిష్యత్తు సారథిగా శుభ్‌మన్ గిల్‌ను రెడీ చేయాలని బీసీసీఐ సెలక్టర్లు భావిస్తున్నారు. గిల్ ఇప్పటికే తన బ్యాటింగ్, నాయకత్వ లక్షణాలతో ముందుకు నడుస్తున్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో ఆశించిన ఫలితాలను రాబట్టకపోయినప్పటికీ, సుదీర్ఘ కాలం పాటు జట్టును నడిపించే సామర్థ్యం అతడికి ఉందని జట్టు యాజమాన్యం నమ్ముతుంది. ఓపెనర్‌గా శుభ్‌మన్ చేసే పరుగులు జట్టుకు అత్యంత కీలకం అయ్యే ఛాన్స్ ఉంది.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఫామ్ జట్టుకు ప్లస్ కానుంది. వన్డే ఫార్మాట్లో కోహ్లీ స్థిరత్వం, రోహిత్ దూకుడు 2027లోనూ టీమిండియాకు అవసరమని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు. వీరిద్దరూ ఫిట్‌నెస్ కాపాడుకుంటే తుది జట్టులో ఉండటం పక్కా.. మరోవైపు కేఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా, జస్ప్రీత్ బుమ్రా ప్రధాన బౌలర్‌గా టీమ్ కి బ్యాక్ బోన్ లా నిలిచే అవకాశం ఉంది.

టీమిండియా 2027 వరల్డ్ కప్ జట్టు అంచనా: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా.

# 21 ఏళ్లకే క్రికెట్‌కి గుడ్ బై.. ఆర్సీబీ కొత్త ఛైర్మన్‌గా ఆర్యమన్ బిర్లా.. ఎలా సాధ్యమైందంటే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. క్రికెట్ ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన టీమ్స్ లో ఒకటైన ఆర్సీబీ జట్టు చేతులు మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఆధ్వర్యంలోని కన్సార్టియం సుమారు 1.78 బిలియన్ డాలర్ల (రూ.16 వేల కోట్లకు)కి ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. బ్రిటన్‌కు చెందిన డయాజియో అనుబంధ సంస్థ 'యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్' నుంచి ఆర్సీబీ 100 శాతం వాటాను ఈ కన్సార్టియం దక్కించుకుంది. ఈ భారీ ఒప్పందంతో ఐపీఎల్ జట్ల విలువ ఒక్కసారిగా భారీగా పెరిగిపోయింది. ఈ మార్పు తర్వాత ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమారుడు ఆర్యమన్ బిర్లా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కాగా ఆర్యమన్ బిర్లా కేవలం వ్యాపార కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినే కాదు.. అతడికి క్రికెట్‌తో సంబంధం కూడా ఉంది. మధ్యప్రదేశ్ తరఫున ఫస్ట్-క్లాస్ క్రికెట్ ఆడిన అనుభవం ఆర్యమన్ కి ఉంది. ఈడెన్ గార్డెన్స్‌లో బెంగాల్ టీమ్ పై సెంచరీ చేసిన చరిత్ర అతడి పేరిట నమోదైంది. ప్రస్తుతం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్‌తో కలిసి గతంలో అతడు డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నాడు. ఆర్సీబీ కొత్త ఛైర్మన్ ఆర్యమన్ బిర్లా ప్రయాణం చాలా ఇంట్రెస్టింగ్ గా కొనసాగింది. 2018 ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు అతడ్ని రూ.30 లక్షలకు దక్కించుకుంది. కానీ అప్పుడు ఒక్క మ్యాచ్ కూడా ఆడే ఛాన్స్ రాలేదు.. దీంతో 2020లో తీవ్ర మానసిక ఒత్తిడితో క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతం ఇస్తూ తనను తాను అర్థం చేసుకోవడానికి ఆ బ్రేక్ తీసుకున్న ఆర్యమన్ బిర్లా.. ఇప్పుడు తన తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని ముందుకు నడిపిస్తున్నాడు. తాజాగా ఓ ఐపీఎల్ జట్టుని కొనుగోలు చేసి అధిపతిగా తిరిగి వచ్చాడు.

ఆర్సీబీ జట్టు కొనుగోలులో ఏ

ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, బోల్ట్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ పార్ట్‌నర్స్ గా ఉన్నాయి. క్రీడలు, మీడియా, వ్యాపార రంగాలలో ఉన్న అనుభవంతో ఆర్సీబీని ప్రపంచస్థాయిలో నెంబర్ వన్ గా నిలబెట్టాలని ప్లాన్ చేస్తున్నారు. ఆర్సీబీ ఎదుగుదలలో భాగస్వామి కావడం తన అదృష్టమని ఆర్యమన్ బిర్లా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలియజేశాడు.

## రియాన్ పరాగ్‌కి రాజస్థాన్ రాయల్స్ బిగ్ షాక్.. కొత్త కెప్టెన్‌గా అతడే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. 2026, మార్చి 24న ఈ జట్టు కొత్త యాజమాన్యం చేతిలోకి వెళ్లిపోయింది. ఇప్పటి వరకు మనోజ్ బదేలే నేతృత్వంలో ఉన్న ఈ ఫ్రాంచైజీని, కల్ సోమాని ఆధ్వర్యంలోని కన్సార్టియం కొనుగోలు చేసింది. గతంలో సుమారు రూ. 320 కోట్లకు కొనుగోలు చేసిన ఈ జట్టు, ఇప్పుడు ఏకంగా రూ. 15,280 కోట్లకు అమ్ముడైంది. ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన లావాదేవీలలో ఒకటిగా నిలిచింది.

**పూర్తి స్థాయి కెప్టెన్‌గా:**

యాజమాన్యంతో పాటు రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ కూడా మారారు. గత సీజన్ వరకు కెప్టెన్‌గా ఉన్న సంజూ శాంసన్, ట్రేడింగ్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్ కు వెళ్లడంతో.. రాజస్థాన్ యాజమాన్యం రియాన్ పరాగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. పరాగ్ గత సీజన్‌లో శాంసన్ అందుబాటులో లేనప్పుడు వైస్ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించాడు. ఈసారి పూర్తి స్థాయి కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు.

**జైస్వాల్ కి కెప్టెన్సీ పగ్గాలు:**

సోషల్ మీడియాలో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్‌ను తొలగించి, యశస్వి జైస్వాల్‌ను నియమించనున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. కానీ ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు.. రాజస్థాన్ ఫ్రాంచైజీ కెప్టెన్సీ మార్పు గురించి ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. 2026, మార్చి 25 ముంబైలో జరిగిన ఐపీఎల్ కెప్టెన్ల ఫోటోషూట్‌లో కూడా రియాన్ పరాగ్ పాల్గొని, ట్రోఫీతో ఫోటోలకు ఫోజులిచ్చారు. అయితే జైస్వాల్ రాజస్థాన్ రాయల్స్ స్టార్ ప్లేయర్, భవిష్యత్తులో కెప్టెన్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి మాత్రం పరాగ్ కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రాజస్థాన్ ఫ్రాంచైజీ జైస్వాల్‌ను రూ. 18 కోట్లకు, పరాగ్‌ను రూ14 కోట్లకు రిటైన్ చేసుకుంది.

**రాజస్థాన్ రాయల్స్ షెడ్యూల్:**

రియాన్ పరాగ్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ తమ ఐపీఎల్ 2026 ప్రయాణాన్ని మార్చి 30న చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది. అనంతరం ఏప్రిల్ 4, 7, 10 తేదీలలో వరుసగా గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లతో తలపడనుంది.

# సీనియర్ హీరోల యంగ్ స్ట్రాటజీ!

టాలీవుడ్ లో ఇప్పుడు ఒక సరికొత్త ట్రెండ్ నడుస్తోంది. ఒకప్పుడు సీనియర్ హీరోలు కేవలం అనుభవజ్ఞులైన దర్శకులతోనే పనిచేయడానికి మొగ్గు చూపేవారు. కానీ మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తమను తాము కొత్తగా ఆవిష్కరించుకోవడానికి సీనియర్ స్టార్లు యంగ్ డైరెక్టర్ల వైపు చూస్తున్నారు. ఈ యంగ్ స్ట్రాటజీ టాలీవుడ్‌లో సరికొత్త రికార్డులకు పునాది వేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి ఈ విషయంలో ముందు వరుసలో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతో 400 కోట్ల వసూళ్లు సాధించి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటారు.తాజాగా చిరంజీవి దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ కల్ట్ చిత్రం చేయడానికి రెడీ అవుతున్నారు. దర్శకుడిగా శ్రీకాంత్ కు ఇది మూడవ చిత్రం మాత్రమే. అయినా అన్నయ్య ఎక్కడా వెనక్కి తగ్గలేదు. తన మార్క్ హిట్ ఇస్తాడు? అనే నమ్మకంతో ముందుకెళ్తున్నారు. ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని సమర్పిచడం అన్కనది మరో ఎత్తు. ఈ ఛాన్స్ తో చిరంజీవి కుర్ర హీరోలకు ఏమాత్రం తీసిపోని ఎనర్జీతో మరో సినిమా చేస్తున్నారని క్లారిటీ వచ్చేసింది. అలాగే నటసింహ నందమూరి బాలకృష్ణ కూడా పంథా మార్చుకున్నారు. వరుస హిట్లతో దూసుకుపోతున్న బాలయ్య తన 112వ సినిమా కోసం సరిపోదా శనివారం ఫేమ్ వివేక్ ఆత్రేయకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారంలో ఉంది.క్లాస్ కథలు రాసే వివేక్ ఆత్రేయ బాలయ్య కోసం ఓ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ క్రేజీ కాంబినేషన్ 2027 సమ్మర్ కానుకగా విడుదలయ్యే అవకాశం ఉంది. బాలయ్య మాస్ ఇమేజ్‌కు వివేక్ ఇంటెలిజెంట్ స్క్రీన్‌ప్లే తోడైతే బాక్సాఫీస్ వద్ద జాతరే. అక్కినేని నాగార్జున తొలి నుంచి కొత్త దర్శకులను ప్రోత్సహించడంలో ముందుంటారు. తాజాగా తన ప్రతిష్టాత్మక 100వ సినిమా బాధ్యతలను కోలీవుడ్ యంగ్ డైరెక్టర్ కార్తీక్ తంగవేలుకు అప్పగించిన సంగతి తెలిసిందే. దర్శకుడిగా కార్తీక్ కి పెద్దగా అనుభవం లేదు. తొలి సినిమా కూడా భారీ విజయం సాధించింది లేదు.

కానీ నాగ్, కార్తీక్ కథను, మేకింగ్ ను నమ్మి ముందుకెళ్తున్నారు. ల్యాండ్ మార్క్ చిత్రాన్నే కార్తీక్ చేతుల్లో పెట్టారంటే యంగ్ మేకర్ ని కింగ్ ఎంతగా నమ్ముతున్నారు? అన్నది అద్దం పడుతుంది. నాగ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయే చిత్రమవుతుందని అభిమానులంతా కాన్ఫిడెంట్ గా ఉన్నారు. విక్టరీ వెంకటేష్ కూడా ఈ యంగ్ డైరెక్టర్ల రేసులో వెనుకబడలేదు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఆదర్శ కుటుంబం పూర్తి చేసిన వెంటనే తన ఫేవరెట్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో మరోసారి చేతులు కలపనున్నారు. ఈ చిత్రంలో నందమూరి కళ్యాణ్ రామ్ కూడా ఒక కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం.దగుబాటి - నందమూరి హీరోలను ఒకే తెరపై చూపించడం అనీల్ కు ఇదే తొలిసారి. 2027 సంక్రాంతికి ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌ను అందించబోతున్నారు. మొత్తానికి టాలీవుడ్ సీనియర్ హీరోలు తమ అనుభవాన్ని యంగ్ డైరెక్టర్ల కొత్త ఆలోచనలతో జోడించి బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఈ మార్పు కేవలం వసూళ్లకే కాకుండా తెలుగు సినిమా పరిధిని పెంచడానికి కూడా దోహదపడుతోంది.



**కర్లీ హెయిర్ మోడ్ ఆన్: ప్రకృతి పావని ఆత్మవిశ్వాసం & ఆకట్టుకునే అవతార్**





**బ్రౌన్ శాటిన్ గౌనులో ప్రణీత సుభాష్ టైమ్‌లెస్ గాంభీర్యాన్ని అందిస్తోంది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com